# ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ లీగ్ టోర్నమెంట్లు

■ క్రీడాకారులను ప్రోత్సహించడమే సాప్ ముఖ్య ఉద్దేశ్యం ■ ముగింపు వేడుకల్లో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ■ 26 జిల్లాల నుండి తరలివచ్చిన 400 మంది బాక్సర్లు




8లో

# పీజీఆర్ఎస్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

## అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పి జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించా లన్నారు. ప్రజల పట్ల మర్యాదగా, సానుభూతితో వ్యవహరించడం ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా గుర్తించాలన్నారు. ఒక చిన్న పని కోసం పని మానుకుని, సెలవులు పెట్టి పాలు సార్లు వస్తున్నారని అందువల్ల నిరాశ ,ఆవేదన ఉంటుందని, ఆ సమయాలలో ప్రజల పట్ల మర్యాదగా సానుభూతితో వ్యవహరించడం ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అన్నారు. ఫిర్యాదుదారుడు స్థానం లో మనం ఉంటే ఇబ్బందులు అర్థమవుతాయన్నారు. అధికారులు విధి నిర్వహణశీగా కాకుండా సామాన్య ప్రజల జీవితాలతో ముడిపడిన అంశాలుగా భావించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజల నుంచి 387 వినతులు అందాయి. అందులో రెవెన్యూ విభాగానికి చెందినవి 33,

తరువాయి 8వ పేజీలో



# 'గ్రేటర్' సౌత్ జోన్‌లో అక్రమ కట్టడాల దందా..!


35వ వార్డు, వేలంపేట బస్టాప్ ఎదుట సందులో


31వ వార్డు దాబాగార్డెన్స్, సెంటర్ పాయింట్ హోటల్ ఎదుట

➲ అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తులు ➲ అధికారుల మౌనం వెనుక ఎవరి అండ..? ➲ పార్కింగ్, సెట్ బాక్స్ నిబంధనలు గాలికి.. ➲ ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం

8లో

# రూ.3.77 కోట్లతో కేజీహెచ్‌లో ఆధునిక హిమోగ్లోబినోపతి కేంద్రం ప్రారంభం



✪ గిరిజన ప్రాంతాల ప్రజలకు వరం ✪ సికల్ సెల్ ఎనీమియా, తలసేమియా బాధితులకు మెరుగైన వైద్యం ✪ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా అందుబాటులో కి వచ్చిన సదుపాయిశీ ✪ పుట్టిన 24 గంటల్లోనే నవజాత శిశువులకు రక్త పరీక్షలు ✪ గిరిజన రోగుల సహాయార్థం కేజీహెచ్‌లో ప్రత్యేక 'ఎస్టీ సెల్' ఏర్పాటు ✪ అదనపు నిధులు రూ. 56 లక్షల మంజూరుకు త్వరలోనే చర్యలు :మంత్రి సంధ్యారాణి

(వార్త 8వ పేజీలో)

# వి ఎం ఆర్ డి ఎ ప్రజా దర్బార్ కి విశేష స్పందన



విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

వి ఎం ఆర్ డి ఎ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రజా దర్బార్ కి విశేష స్పందన లభించింది. ప్రజా దర్బార్ లో వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ శ్రీ ఎం వి ప్రణవ్ గోపాల్ గారు పాల్గొని బాధితుల నుంచి వినతులు అందుకున్నారు. వారితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని, సంబంధిత అధికారులతో చర్చించారు. వినతుల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు. బాధితులని ఎక్కువ సార్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాలని ఆదేశించారు. ప్రజా దర్బార్ కి మొత్తం 7 వినతులు రాగా, వాటిలో ప్లానింగ్ 2, పరిపాలన 2, ఇంజనీరింగ్ కు 2 చొప్పున వినతులు వచ్చాయి. కార్యక్రమంలో కార్యదర్శి మురళీ కృష్ణ, ముఖ్య ఇంజనీర్ వినయ్ కుమార్ , ఎస్ ఈ మధు గారు ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 120 ఫిర్యాదులు




వార్త 8లో

# వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌కు శంకుస్థాపన




8వ పేజీలో

# పీజీఆర్ఎస్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

7వ తరువాయి ..

జీవీఎంసీ 163 ఉన్నాయి. ఇతర అన్ని శాఖల సంబంధించి 165 వినతులు రాగా పోలీస్ శాఖకు 26 వచ్చాయి. జాయింట్ కలెక్టర్ తో పాటు డి.ఆర్.ఓ. ఎం విశ్వేశ్వర్ నాయుడు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సత్య వేణి, డిప్యూటీ కలెక్టర్ గోవింద్, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ కు శంకుస్థాపన

రుషికొండ, మే 18, ప్రభాతవార్త:

రుషికొండ బీచ్ లో ఓషన్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ కు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. 1.5 ఎకరాల్లో రూ.3.35 కోట్లతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్), వి.ఎం.ఆర్.డి.ఏ. సంయుక్తంగా ఈ సెంటర్ ను నిర్మించనున్నాయి. సర్ఫింగ్, కయాకింగ్, కన్నోయింగ్, సెయిలింగ్, స్టాండ్ అప్ పాడింగ్ వంటి వాటర్ స్పోర్ట్స్ కు అవసరమైన సౌకర్యాలు ఇక్కడ కల్పిస్తారు. ఆయా స్పోర్ట్స్ కు సంబంధించి క్రీడాకారులకు అవసరమైన శిక్షణనిస్తారు. ప్రస్తుతం రుషికొండ బీచ్ లో స్పీడ్ బోటింగ్, స్కూబా డైవింగ్, జెట్ స్కీ, వించ్ పారా సెయిలింగ్, పారా మోటార్ తదితర స్పోర్ట్స్ అందుబాటులో ఉన్నాయి. కార్యక్రమంలో శాప్ చైర్మన్ ఎ.రవి నాయుడు, వి.ఎం.ఆర్.డి.ఏ. చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ జూన్ గాలియట్, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, శాప్ డైరెక్టర్లు మేడిద రాజా, బుచ్చిరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, బుదిరెల అప్పారావు, శాఖారి శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాసిరావు, నాగోతి సత్యనారాయణ, లొడగల రామ్మోహన్, సారిపల్లి శ్రీనివాస్, అక్కరబోయిన రాంబాబు, నాగరాజు, దొరబాబు, నాగలక్ష్మి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.3.77 కోట్లతో కేజీహెచ్‌లో ఆధునిక హిమోగ్లోబినోపతి కేంద్రం ప్రారంభం

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

గిరిజన ప్రాంతాల్లోని ప్రజలను వేధిస్తున్న సికిల్ సెల్ ఎనీమియా, తలసేమియా వంటి జన్యుపరమైన రక్తహీనత వ్యాధుల నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారం ఉదయం విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3 కోట్ల 77 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన హిమోగ్లోబినోపతి - కాంప్రెహెన్సివ్ కేర్ సెంటర్ (సీ ఓ సీ) ను స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. అరుకు పార్లమెంట్ పరిధిలోని విశాఖపట్నం చుట్టుపక్కల ఉన్న గిరిజన ప్రాంతాల ప్రజలు సికిల్ సెల్ ఎనీమియాతో పడుతున్న ఇబ్బందులను గుర్తించి, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ కేంద్రాన్ని తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ కేంద్ర గిరిజన సంక్షేమ శాఖతో నిరంతరం సంప్రదింపులు జరపడం ద్వారా, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక చొరవ చూపడంతో ఈ సీ ఓ సీ కేంద్రం సకాలంలో అందుబాటులోకి వచ్చేలా కృషి చేయడం ఉత్తరాంధ్రా గిరిజనులకు ఊరటని ఇస్తుందని తెలిపారు.

### దక్షిణాది రాష్ట్రాల లోనే ప్రథమం ..

రక్తహీనతతో బాధపడే నవజాత శిశువులను ముందే గుర్తించేందుకు, పుట్టిన 24 గంటల తర్వాతే వారికి బ్లడ్ టెస్ట్ చేసే సరికొత్త విధానాన్ని దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా మన కేజీహెచ్‌లోనే ప్రారంభించడం రాష్ట్ర వైద్య రంగ ప్రగతికి నిదర్శనమని,మంత్రి చెప్పారు దీనివల్ల చిన్న వయసులోనే వ్యాధిని గుర్తించి ప్రాణనష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. కేజీహెచ్ హాస్పిటల్‌కు వచ్చే గిరిజన ప్రజలు గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ఎస్టీ సెల్ ను గతం లోనే ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం దాన్ని బలోపేతం చేస్తూ ఇక్కడ ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉండి,గిరిజన రోగులకు ఏ విభాగానికి వెళ్ళాలి, ఎలాంటి వైద్యం తీసుకోవాలో మార్గదర్శకత్వం చేస్తారని తెలిపారు. హాస్పిటల్‌లో అందుబాటులో లేని మందులను ఐటీడీఏ ద్వారా ఇప్పించడంతో పాటు, అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం కూడా అందిస్తామన్నారు. ఈ కేంద్రం నిర్వహణకు, మరింత ఆధునీకరణకు హాస్పిటల్ సూపరింటెండెంట్ కోరిన అదనపు నిధులు రూ.56 లక్షలను కూడా ప్రభుత్వం నుండి త్వరలోనే మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రాలోని పాలకొండ నుండి రంపచోడవరం, పోలవరం వరకు ఉన్న గిరిజన ప్రజలందరూ ఈ కేంద్రాన్ని సందర్శించి, ఉచితంగా బ్లడ్ టెస్టులు చేయించుకోవాలని కోరారు. సికిల్ సెల్ ఎనీమియా అనేది అంటువ్యాధి కాదని, ఇది కేవలం జన్యుపరంగా వచ్చే వ్యాధి అని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకుని, ప్రభుత్వం అందించే కార్డును పొంది, తద్వారా వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎన్ టి ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణి, ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ సంధ్యారాణి వైద్యులు, కేజీహెచ్ అధికారులు, ఐటీడీఏ అధికారులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై హైడ్రోక్లోరిక్ యాసిడ్ లీకేజీ కలకలం

## - అప్రమత్తమైన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది - తప్పిన పెను ప్రమాదం

ఆనందపురం, మే 18, ప్రభాతవార్త:



ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై సోమవారం హైడ్రోక్లోరిక్ యాసిడ్ లీకేజీ ఘటన కలకలం రేపింది. కొవ్వూరు నుంచి ఆనందపురం వైపు వస్తున్న హైడ్రోక్లోరిక్ యాసిడ్‌తో నిండిన ట్యాంకర్‌ను తెల్లవారుజామున ఒక ఐచర్ వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ట్యాంకర్ దెబ్బతింది. ప్రమాదం అనంతరం ట్యాంకర్‌కు తాత్కాలిక మరమ్మతులు చేసి తరలిస్తుండగా సాయంత్రం సమయంలో మళ్లీ యాసిడ్ లీకేజీ ప్రారంభమైంది. ట్యాంకర్‌లో సుమారు 30 టన్నుల హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఉండటంతో పరిస్థితి ఒక్కసారిగా ఆందోళనకరంగా మారింది. జాతీయ రహదారిపై యాసిడ్ చిందడంతో దట్టమైన పొగలు వ్యాపించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఆనందపురం సీఐ వాసునాయుడు వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ట్రాఫిక్ పోలీసులు, జాతీయ రహదారి అధికారులు, స్థానిక సిబ్బంది కలిసి ట్యాంకర్‌ను దుక్కవానిపాలెం టోల్ గేట్ సమీపంలోని సురక్షిత ప్రాంతానికి తరలించారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదం కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను మళ్లించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది భారీగా నీటిని పోసి యాసిడ్ ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టి పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఎటువంటి ప్రమాదం లేదని అధికారులు తెలిపారు. సమీప గ్రామాల్లో నీటి కాలుష్యం లేదా ప్రజారోగ్య సమస్యలు తలెత్తకుండా రెవెన్యూ, జిల్లా పరిపాలన, మండల పరిషత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు సీఐ వాసునాయుడు తెలిపారు.

# పెట్రో ధరల పెంపుపై వైసిపి నిరసన ప్రదర్శన

## -గాజువాక డిపో నుండి ములగాడ ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ర్యాలీ

## -ప్రజలపై చంద్రబాబు బాదుడే బాదుడు:మాజీ ఎమ్మెల్యే మళ్ళ విజయప్రసాద్

గాజువాక, మే 18, ప్రభాతవార్త:



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ళ విజయప్రసాద్ ధ్వజమెత్తారు. ధరల పెంపునకు వ్యతిరేకంగా వైసిపి అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పశ్చిమ నియోజకవర్గంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ పరిశీలకులు జహీర్ అహ్మద్, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులతో కలిసి గాజువాక డిపో వద్ద నుంచి ములగాడ ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ డి. రమకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మళ్ళ విజయప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గిస్తామని హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు, అధికారంలోకి రాగానే ఆ మాటలు విస్మరించారని మండిపడ్డారు. రేట్లు తగ్గించకపోగా, ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించుకోకుండా వాహనదారులపై మోయలేని భారం వేశారన్నారు. డీజిల్ రేట్లు పెరగడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి, నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, మహిళలు, యువజన విభాగం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ లీగ్ టోర్నమెంట్లు

గాజువాక,మే 18, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వికాస్‌నగర్ రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ లీగ్ పోటీలు సోమవారం నాటితో ఘనంగా ముగిశాయి. క్రీడల్లో పోటీ తత్వాన్ని పెంచడం, మారుమూల ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించేందుకు సాప్ ఈ ఏడాది ఫిబ్రవరి నుండి డిసెంబర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా 31 క్రీడా విభాగాల్లో ఈ లీగ్ టోర్నమెంట్లను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గాజువాకలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి దాదాపు 400 మంది క్రీడాకారులు, 104 మంది కోచ్‌లు, మేనేజర్లు, 50 మంది సాంకేతిక అధికారులు తరలివచ్చారు.

ఈ బాక్సింగ్ పోటీల ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఏపీ టీడీపీ అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

### హోరాహోరీగా సాగిన పోటీలు.. విజేతల వివరాలు...

అండర్-15, అండర్-19 విభాగాల్లో బాలురు, బాలికలకు నిర్వహించిన బాక్సింగ్ పోటీలు క్రీడాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రింగులో బాక్సర్లు పంచ్‌ల వర్షం కురిపిస్తూ హోరాహోరీగా తలపడ్డారు.అండర్-15 విభాగం మొత్తం 15 కేటగిరీలలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు 15 బంగారు (గోల్డ్), 15 రజత (సిల్వర్) పతకాలను అతిథులు అందజేశారు. అండర్-19 విభాగం: మొత్తం 10 కేటగిరీలలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి 10 బంగారు, 10 రజత పతకాలను బహూకరించారు.

### ఘనంగా ముగింపు వేడుకలు....

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో విశాఖపట్నం జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జూన్ గ్యాలియెట్, సాప్ బోర్డు డైరెక్టర్ పి.వి.బి.ఎస్.ఎన్. రాజు (బుచ్చిరాజు), ద్రోణాచార్య అవార్డు గ్రహీత (బాక్సింగ్) ఐ. వెంకటేశ్వర రావు, బ్యూటిఫికేషన్ చైర్మన్ పెంటిరాజు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు, విశాఖపట్నం డిస్ట్రిక్ట్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, సాప్ బాక్సింగ్ కోచ్‌లు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా శిక్షకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.

# 'గ్రేటర్' సౌత్ జోన్‌లో అక్రమ కట్టడాల దందా..!

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

'గ్రేటర్' సౌత్ జోన్ పరిధిలో అక్రమ కట్టడాల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో జీ ప్లస్ 2 అనుమతులతో ప్రారంభమైన నిర్మాణాలు అదనపు అంతస్తులతో కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రత్యేకంగా నివాస ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు లేకుండానే భారీ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారని, సెట్‌బ్యాక్ నిబంధనలు పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని చెబుతున్నారు. ఇళ్ల మధ్య కనీస దూరం కూడా పాటించకుండా నిర్మాణాలు కొనసాగుతుండటంతో అగ్నిప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సౌత్ జోన్‌లోని పలు డివిజన్లలో అక్రమ నిర్మాణాలకు కొందరు మధ్యవర్తులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అనుమతులు లేని భవనాలకు కూడా 'సెట్టింగ్'లతో గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 31వ వార్డు పరిధి దాబాగార్డెన్స్, సెంటర్ పాయింట్ హోటల్ ఎదురుగా ఎటువంటి నిబంధనలు పాటించకుండా.. గెడ్డకు ఆనుకొని రెండు భవనాల నిర్మాణానికి ప్లాన్స్ తీసుకొని, రెండు ప్లాన్స్ కలిపి ఒక్కటే భారీ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. గెడ్డకు.. భవనానికి దాదాపు నాలుగు మీటర్స్ స్థలం వదలవలసి వున్నా.. రెండు అడుగులు స్థలం కూడా వదలకుండా.. ఈ భవనాన్ని నిర్మిస్తున్నా.. కనీసం పట్టించుకోకపోవడం విశేషం. 35వ వార్డు పరిధిలోని వేలంపేట బస్టాప్ ఎదురుగా ఇరుకైన సందులో నిబంధనలను ఉల్లంఘించి ఎటువంటి సెట్ బాక్స్ లేకుండా అంతస్తులపై అంతస్తులు నిర్మిస్తుంటే.. ఆ భవన నిర్మాణదారుడికి పవన్ కళ్యాణ్ సిబ్బంది పత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అవినీతి మత్తులో...

అక్రమ నిర్మాణదారుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి అధికార స్థాయిలో వ్యవహారాలు చక్కబెడుతున్నారన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.అనుమతులు ఒకలా తీసుకుని మూడు, నాలుగు అంతస్తులు నిర్మించడం సాధారణమైందని స్థానికులు అంటున్నారు. కొన్నిచోట్ల పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజలు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని స్థానిక సంఘాలు చెబుతున్నాయి. అక్రమ నిర్మాణాల కారణంగా ఇప్పటికే పలుచోట్ల రహదారులు ఇరుకుగా మారిపోయాయని, డ్రైనేజీ సమస్యలు తీవ్రమవుతున్నాయని పేర్కొంటున్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, ట్రాఫిక్ సమస్యలు పెరగడం వంటి ఇబ్బందులు ప్రజలను వేధిస్తున్నాయి.అంతేకాకుండా పాత కాలనీల్లో నిర్మాణ భద్రతా ప్రమాణాలు పాటించకుండా బహుళ అంతస్తులు నిర్మించడం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నా.. కొందరు అధికారులు మాత్రం నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. ఫిర్యాదులు అందిన చోట తనిఖీలు నిర్వహించి నోటీసులు జారీ చేస్తున్నామని పేర్కొంటున్నారు. అయితే స్థానికులు మాత్రం కఠిన చర్యలు తీసుకోకపోతే అక్రమ నిర్మాణాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.జీవీఎంసీ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సౌత్ జోన్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న నిర్మాణదారులు, సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రవీణ్ కుమార్ కు న్యాయం చేయండి.. బాధ్యులపై చర్యలు తీసుకోండి

## - విదసం నేత బూసి వెంకట రావు

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త



ఆంధ్ర విశ్వ విద్యాలయం అంబేద్కర్ చైర్ పరిశోధకుడు ప్రవీణ్ కుమార్ పై ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రాజశేఖర్ వేదింపులు ఆపాలని , జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశాల పై పోలీసులు విచారణ జరపాలని విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు మాట్లాడుతూ డిమాండ్ చేశారు.. ఆంధ్ర యూనివర్సిటీ లో జరుగుతున్న కుల వివక్ష పై చర్యలు కోసం జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో యూనివర్సిటీ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద విదసం నేతృత్వంలో నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ చైర్ ఫౌండేషన్ లో పరిశోధన చేసే దళిత స్కాలర్స్ ను కుల పరంగా అవమానిస్తూ ఫెలోషిప్ వేతనం, పరిశోధన పత్రాలు ఆమోదం వంటి ఎకడమిక్ పద్ధతులు అమలు చేయకుండా వీసీ , డీన్ ఆర్ అండ్ డీ వేధిస్తున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంతమంది రాజకీయ నాయకులు వీసీ నీ ప్రభావితం చేస్తున్నారని మొత్తం దళితుల పట్ల నేటి వీసీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 100 ఏళ్ల యూనివర్సిటీ ప్రతిష్ట ను వీసీ మంటగలుపుతున్నారని మండి పడ్డారు..ప్రతిభ కలిగిన యూనివర్సిటీ ఎకడమిస్ట్ లు ఎంతోమంది ఉండగా ప్రభుత్వం బయటి వ్యక్తిని తెచ్చి రుద్దడం వల్ల ఆంధ్ర యూనివర్సిటీ లో కుల వేధింపుల, కులతత్వం రాజ్యమేలుతుందన్నారు.. ప్రవీణ్ కుమార్ పిర్యాదు పై జాతీయ ఎస్సీ కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులు ఆధారంగా పోలీసు కమిషనర్ తక్షణ చర్యలు తీసుకోవాలని, గవర్నర్ జోక్యం చేసుకుని పాఫెసర్ రాజశేఖర్ ను వీసీ పదవినుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.జాజి ఓంకార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుడివాడ ప్రసాద్, గోడి వెంకటేశ్వర రావు, గుడివాడ భాస్కర రావు, చెక్క రాంబాబు, జీ తాత బాబు, మూర మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్దేశపూర్వకంగానే దళిత స్కాలర్లపై వివక్ష

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త,

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో దళిత రీసెర్చ్ స్కాలర్ లమీద ఏయూ యాజమాన్యం వేధింపులకు దిగడం, ఉద్దేశపూర్వకంగా వివక్ష కనపరచడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జై వి ప్రభాకర్ తెలిపారు. దళిత హక్కుల పోరాట సమితి, అంబేద్కర్ మెమోరీ సొసైటీ ప్రతినిధులు నిజ నిర్ధారణ కోసం ఏయూని సందర్శించారు. బాధిత అంబేద్కర్ చైర్ ఫెలోషిప్ స్కాలర్ లు అయిన ప్రవీణ్ కుమార్, మరో స్కాలర్ రాజ్ కుమార్ ను కలిసి వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు. గత 14 నెలలుగా ఇద్దరు స్కాలర్లను ఉద్దేశిపూర్వకంగానే ఇబ్బందులకు గురి చేస్తున్నారని, యూజీసీ నుంచి గ్రాంట్ వచ్చినప్పటికీ వీరికి నిధులు విడుదల చేయకుండా ఇబ్బంది పెడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జే వి ప్రభాకర్ అన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తే గాని గ్రాంట్ విడుదల చేయలేదన్నారు. గ్రాంటు ఇచ్చినట్లు యుటిలైజేషన్ సర్టిఫికెట్ కూడా ఆలస్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బి కళ్యాణ్ రావు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సామ రాజులు తదితరులు పాల్గొన్నారు.

# రామలింగేశ్వర ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం

మధురవాడ, మే 18 ప్రభాతవార్త

మిథిలాపురి లే అవుట్ శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయం ట్రస్టు బోర్డు సభ్యులతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి సభ్యులందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ట్రస్టు బోర్డు చైర్మన్ గా ఎం. కోటేశ్వరరావును, వైస్ చైర్మన్ గా ఎం. రాజేశ్వరిలను ప్రకటించారు. సభ్యులుగా పి.భాస్కరరావు, జి.త్రిమూర్తి రాజు, ఎం. శ్రీనివాసరావు, ఎస్.గురుమూర్తి, జి.పద్మజ, జి.గిరిజలు ప్రమాణం చేశారు. జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల అప్పారావు, మాన్యాల సోంబాబు, నాగోతి సత్యనారాయణ, చెట్టుపల్లి సన్యాసిరావు, నాగోతి సూర్య ప్రకాష్, మండా రమేష్, పిల్లా రాము, శ్రీకాంత్ రాజు, బోయి శ్రీను, నమ్మి రమణ, పోతిన ప్రసాద్, పిల్లా మోహన్ కృష్ణ, అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 120 ఫిర్యాదులు

విశాఖపట్నం, మే 18 ప్రభాతవార్త



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు 120 ఫిర్యాదులు వచ్చాయి. ప్రతీ సోమవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ డాక్టర్.శంఖబ్రత భాగ్చి, ఐ.పీ.ఎస్., ప్రత్యక్షముగా నగర పోలీసు సమావేశమందిరం నందు లో నగర సబ్-డివిజన్ ఏ.సి.పి లు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ లు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనీ, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 120 మంది ఫిర్యాదుదారులు వచ్చి తమ తమ సమస్యలను రిపోర్టులు ద్వారా పోలీసు కమిషనర్ కి అందజేసినారు. సిపి ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదిదారులతో స్వయముగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసినదిగా ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి మరియు సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

# డీజిల్ ధరల పెరుగుదలతో కుదేలైన మత్స్య పరిశ్రమను కాపాడాలి



విశాఖపట్నం, మే 18 ప్రభాతవార్త

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మెకనైజ్డ్ మరియు మోటరైజ్డ్ ఫిషింగ్ బోట్ యజమానులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారు. దేశవ్యాప్తంగా డీజిల్ ధరలు అమాంతం పెరగడంతో మత్స్య పరిశ్రమ పూర్తిగా కుదేలయ్యే పరిస్థితి ఏర్పడింది. సముద్రంలో వేటకు వెళ్లే ఖర్చులు భారీగా పెరగడంతో వేలాది మంది మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే ప్రమాదంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫిషింగ్ బోట్లకు వినియోగించే డీజిల్‌పై లీటరుకు రూ.25/- సబ్సిడీని కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే మంజూరు చేసి మత్స్యకారులను ఆదుకోవాలని వాసుపల్లి జానకిరామ్ అధ్యక్షతన సుమారు 400 మంది ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు గట్టిగా డిమాండ్ చేసింది. అదేవిధంగా, గతంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఫిషింగ్ బోట్ల మరమ్మతులు, నిర్మాణ పనులు మరియు ప్రమాదాల సమయంలో బోట్ యజమానులకు ఉపయోగపడే విధంగా ఒక క్రేన్ మంజూరు చేయాలని ప్రతిపాదించగా, గత విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ రామ్ మోహన్ రావు గారు దానిని ఆమోదించి శాంక్షన్ చేసినప్పటికీ ఇప్పటివరకు ఆ క్రేన్ హార్బర్‌లో అందుబాటులోకి తీసుకురాకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం

విశాఖపట్నం, మే 18 ప్రభాతవార్త

ఇసుక కొండ ప్రాంతంలోని శ్రీ శ్రీ శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం తో పాటు పూర్ణామార్కెట్ శ్రీ దుర్గాలమ్మ ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా సమాజానికి సాంస్కృతిక వారసత్వాన్ని అందించే కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.

భక్తుల సౌకర్యార్థం ఆలయాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ , ప్రజల సహకారంతో ఆలయాల అభివృద్ధి మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జి సుధాకర్ , జనసేన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివప్రసాద్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు , కూటమి నాయకులు, కార్యకర్తలు, దుర్గాలమ్మ ఆలయ చైర్మన్ రఘు, సత్యనారాయణ స్వామి ఆలయ చైర్మెన్ సూర్య ప్రకాశ్ , భక్తులు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మధురవాడ జోన్ వార్డుల విభజనపై అభ్యంతరం

పిఎం పాలెం, మే 18, ప్రభాతవార్త:

జీవీఎంసీ పరిధిలోని మధురవాడ జోన్‌లో చేపట్టిన వార్డుల విభజన విధానం పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా 10వ వార్డు పరిధిలో పి.ఎం.పాలెం సమీప ప్రాంతాలను కలపకుండా, దూరంగా ఉన్న ఎం.వి.వి సిటీ తదితర ప్రాంతాలను కలిపి విభజించడం అన్యాయమని స్థానికులు పేర్కొంటు న్నారు. నేషనల్ హైవేను కేంద్రంగా తీసుకుని ఒక వైపు మూడు వార్డులు, మరో వైపు రెండు వార్డులుగా విభజిస్తే పరిపాలనా సౌలభ్యం ఉంటుందని జనసేన పార్టీ విశాఖపట్నం రూరల్ వైస్ ప్రెసిడెంట్ ఈ.ఎన్.ఎస్ చంద్రరావు తెలిపారు. ప్రజల అవసరాలు, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా చేసిన ఈ విభజనపై జీవీఎంసీ అధికారులు పునరాలోచన చేసి తగిన సర్దుబాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి వార్డుల విభజనలో మార్పులు చేయాలని చంద్రరావు కోరారు.

# పెట్రోల్ భారం ప్రజలపై మోపింది ఎవరు?

## : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్రీనివాస్

పిఎం పాలెం, మే 18, ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరల భారాన్ని ప్రజలపై మోపింది గత వైసీపీ ప్రభుత్వమేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్రీనివాస్ విమర్శించారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఐదు సంవత్సరాల కాలంలో విడతల వారీగా లీటరు పెట్రోల్‌పై సుమారు రూ.45 వరకు భారం పెంచారని ఆయన ఆరోపించారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రజలకు ఎటువంటి ఉపశమనం కల్పించలేదని పేర్కొన్నారు.ఇతర రాష్ట్రాలు పన్నులు తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ, అప్పటి వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తగ్గించలేదని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాలనలో కనిపిస్తున్న ధరల పెరుగుదల రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల కాదని, అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల ప్రభావంతో దేశవ్యాప్తంగా ఏర్పడిన స్వల్ప పెరుగుదల మాత్రమేనని తెలిపారు. దేశ ప్రధాని తమ వాహన వినియో గాన్ని తగ్గించు కుని ఆదా చర్యలు చేపడు తున్నారని, అలాగే గౌరవ ముఖ్య మంత్రి కూడా భద్రతా సిబ్బంది వాహనాల విని యోగాన్ని తగ్గిస్తూ డీజిల్ ఆదా దిశగా చర్యలు తీసుకుం టున్నారని పేర్కొన్నారు. భవిష్య త్తులో యుద్ధ ప్రభావం వల్ల మరిన్ని ఆర్థిక ఇబ్బం దులు వచ్చే అవకా శాలను ముందు గానే అంచనా వేసి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుం టోందని అన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలు, మేధావులు, రాజకీయ పార్టీలు కలిసి పరిస్థితులను ఎదుర్కో వాల్సి ఉండగా, తమ రాజకీయ ఉనికిని కాపాడు కోవడానికి వైసీపీ నాయకులు ధర్నాల పేరుతో రోడ్లపైకి రావడం ప్రజలు సహ్యించు కుంటున్నారని దాసరి శ్రీనివాస్ వ్యాఖ్యా నించారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : విజయనగరం
రికవరీ సెక్షన్, పాత బాలాజీ జంక్షన్,
రింగ్ రోడ్డు, విజయనగరం-535002.

**హైపోథెకేషన్ డీడ్ క్రింద బ్యాంకుకు సెక్యూరిటీగా హైపోథికేట్ చేయబడిన వాహనము అమ్మకానికి ఇ-వేలం నోటీసు**

కెనరా బ్యాంక్ సెక్యూర్డ్ క్రెడిటర్ స్వాధీనం చేసుకున్న, బ్యాంకు/సెక్యూర్డ్ క్రెడిటర్‌కు హైపోథికేట్ చేయబడిన/చార్జ్ చేయబడిన, కెనరా బ్యాంక్ వారికి బకాయిల మొత్తాన్ని తిరిగి పొందడానికి క్రింద వివరించిన వాహనాలను "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది.10.06.2026 న మ॥ 03:00 నుండి సా॥ 04:00 గం॥ల వరకు విక్రయించబడుతుందని, ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. ఋణగ్రహీత వివరాలు, బకాయి ఉన్న మొత్తం, వాహనం యొక్క వివరాలు, రిజర్వు ధర మరియు ముందస్తు డబ్బు డిపాజిట్, బిడ్ పెరుగుదల క్రింద ఇవ్వబడ్డాయి.

**చింతలవలస బ్రాంచ్, ఫోన్: 83310 15675**

ఋణగ్రహీత: శ్రీ. మాలేపాటి వెంకటేశ్వర్లు, డి నెం.37-7-26, శివాలయం వీధి, మంచుకొండ గార్డెన్స్, సత్య నగర్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530007 వారు చెల్లించవలసిన బకాయి మొత్తం: రూ. 3,38,125.45/- + తేది.15.05.2026 నుండి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు.

| వాహనం వివరములు | రిజర్వు ధర |
| --- | --- |
| HYUNDAI MOTOR COMPANY<br>Vehicle Reg.No: AP 35 AQ 2548<br>Engine No: D4FCJM626197<br>Chassis No: MALBM51RLJM574353<br>Model: I20 ACTIVE CRDI | రూ. 4,20,000/-<br>ధరావత్తు<br>రూ. 42,000/- |

★ ఆన్‌లైన్ ఈ -వేలం అమ్మకం జరుగు పోర్టల్ https://baanknet.com ★ రిజర్వ్ ధరలో 10% ధరావత్తు మొత్తాన్ని M/s పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని ధరావత్తును RTGS/NEFT ద్వారా చలానాలోని ఖాతా వివరములుకు తేది 10.06.2026 న మ॥ 12.00 గం॥ల లోపుగా పొందుపరిచి జమచేయాలి. ★ విజయవంతమైన బిడ్డర్ అమ్మకపు ధరలో 25% (ఇప్పటికే చెల్లించిన ధరావత్తుతో సహా) వెంటనే అదే రోజు మరియు తదుపరి పనిదినం తర్వాత డిపాజిట్ చేయాలి మరియు మిగిలిన 75% అమ్మకపు ధరను సెక్యూర్డ్ క్రెడిటర్ అమ్మకం నిర్ధారించిన తేదీ నుండి 15 రోజులలోపు జమ చేయాలి. ★ విజయవంతమైన బిడ్డర్ పైన తెలిపిన వ్యవధిలోపు అమ్మకపు ధరను చెల్లించకపోతే, అతను చేసిన డిపాజిట్‌ను అధీకృత అధికారి ఎటువంటి నోటీసు లేకుండా జప్తు చేస్తారు మరియు ఆస్తిని వెంటనే మళ్ళీ అమ్మకానికి ఉంచుతారు. వాహనం యొక్క తగిన శ్రద్ధ మరియు భౌతిక ధృవీకరణ మరియు బిడ్ సమర్పించే ముందు ఆస్తి/ఆస్తుల వివరణ గురించి సంతృప్తి చెందడం బిడ్డర్ బాధ్యత. బిడ్ సమర్పించిన తర్వాత ఎటువంటి క్లెయిమ్‌ను బ్యాంకు స్వీకరించదు. ఆసక్తిగల బిడ్డర్లకు తేది.18.05.2026 నుండి 06.06.2026 వరకు ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4:00 గం॥ల మధ్యలో వెబ్‌సైట్ వేలంలో వాహన తనిఖీకి అనుమతి ఉంటుంది. ★ వేలం రద్దు చేయుటకు / వాయిదా వేయుటకు బ్యాంక్ వారికి సర్వ హక్కులు కలవు. ★ విజయవంతమైన బిడ్డరు వాహనం యొక్క గోడౌన్ పార్కింగ్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ మొదలైన వాటికోసం అయ్యే అన్ని ఛార్జీలు భరించవలసి ఉంటుంది. ★ ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: M/s పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్, వెబ్ పోర్టల్: https://baanknet.com, మొబైల్ : 7046612345/6354910172 /8291220220/9892219848/8160205051.

తేది : 16.05.2026, స్థలం : విజయనగరం | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

## జూన్ 23న మాధవధార కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండుగ

మాధవధార, మే 18, ప్రభాతవార్త



మాధవధార గ్రామ దేవత,గ్రామ ఇలవేల్పు శ్రీ కుంచుమాంబ అమ్మవారి పండుగకు సంబదించి గ్రామస్తుల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్ణయించారు.జూన్ 22వ తేది సోమవారం నాడు శ్రీ కుంచుమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం నిర్వహిస్తారని,జూన్ 23వ తేది మంగళవారం నాడు శ్రీ కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండుగ,జూన్ 30వ తేది మంగళవారం నాడు శ్రీ కుంచుమాంబ అమ్మవారి మారువారం,జూలై 2వ తేది గురువారం నాడు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి పండుగ,జూలై 5వ తేది ఆదివారం నాడు శ్రీ కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ మాధవ యువజన సమాజం కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు తెలిపారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గో మాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గో మాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలి.

### కలెక్టర్లు తప్పనిసరిగా ఎస్పిసిఏ మీటింగ్‌లను తప్పనిసరిగా నిర్వహించాలి

### మట్టికొయ్య పోతురాజు, అధ్యక్షులు, హైందవ దళితసేన



విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

గావో విశ్వస్య మాతరః: ఎస్పిసిఏ గనుక జిల్లా కలెక్టర్లు సక్రమంగా నిర్వహించి అధికారులను అప్రమత్తం చేయగలిగితే జంతువధ, ప్రధానంగా గో వధ ఆపడానికి పెద్ద అవరోధం ఉంటుందని కావున తప్పనిసరిగా ఎస్పిసిఏ మీటింగ్‌లను నిర్వహించాలని కోరుతూ విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాన్ని సమర్పించినట్లు హైందవ దళితసేన వ్యవస్థాపక అధ్యక్షులు మట్టికొయ్య పోతురాజు మీడియా సమావేశంలో వెల్లడించారు. విశాఖపట్నం వింజాన్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హైందవ దళితసేన గౌరవ అధ్యక్షులు బూసిం వైవి సత్యనారాయణతో కలిసి మాట్లాడారు. భారత దేశ సంస్కృతి సంప్రదాయాలలో గో మాతకు ఉన్న ప్రత్యేకత మీకు తెలియంది కాదు. అనేక కారణాల వల్ల మనదేశంలో గో సంతతి నశిస్తున్న సంగతి కూడా మీకు తెలుసు. గోసంతతిని పెంచి పోషించాల్సిన రైతు వ్యవసాయంలో గో, వృషభాలను పక్కనపెట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ ముందుకు పోతున్నాడు. అలాగే రసాయనాలతో కూడిన పాలు, పెరుగు, నెయ్యి వంటి వాడుకుంటూ కుటుంబ ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. మనకు దైవమిచ్చిన ప్రకృతి సంపదలో గో సంతతి ప్రధానమైనది. పురాణకాలం నుండి గో సంతతి ఈ దేశంలో కుటుంబంలో ఒక సభ్యునిగా కలిసి ఉండేది. కానీ, ఈ రోజు అదే గోవు పోషణ లేక రోడ్డున పడి ప్లాస్టిక్ పదార్థాలను తింటూ ఆరోగ్యం పాడు చేసుకోవడంతో పాటు ఎవరికీ అక్కర్లేని పశువులా మారిపోయింది. ఇది చాల దురదృష్టకరం. ఈ విషయంలో ప్రజలందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో హైందవ దళిత సేన, ఆంధ్రప్రదేశ్, ధర్మో రక్షతి రక్షితః ఫౌండేషన్ మరియు ఇతర గో రక్షా ప్రేమికులతో కలిసి గో రక్షా రథయాత్ర పేరుతో ఇచ్ఛాపురం నుండి హిందూ పురం వరకూ గో మాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోటి సంతకాల సేకరణ, గో మాత, గో సంతతి పట్ల అవగాహన పేరుతో 6 నెలల పాటు రథయాత్ర, పాదయాత్ర, బహిరంగ సభ ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఎంత చైతన్యవంతులైనా ప్రభుత్వ సహకారం లేకుండా ముందుకు పోలేమన్న సంగతి మీకూ తెలుసు. అందుకే ప్రజా ప్రతినిధులైన రాష్ట్ర ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేల సహకారాన్ని అర్థిస్తూ వారి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము. ఉత్తరాంధ్రలోని ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు ఇచ్చాము. పార్లమెంట్‌లో కూడా చట్టం తెచ్చి గో మాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని ఎంపిలకు విజ్ఞప్తి చేస్తున్నాము. అదే విధంగా గో సంతతిని కూడా ప్రతి ఇంటా ఒక సభ్యునిగా చేర్చుకుని పెంచుకునేలా నెల నెల వృద్ధులకు, వికలాంగులకు ఇస్తున్నట్లు పెన్షన్ మాదిరి చేయాలని, ధర్మాదాయ శాఖ నుండి 30% నిధులను కేటాయించి గోవును కూడా రూ. 1,000/-ల చొప్పున పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము. ఇదేవిధంగా గోసంతతిని లెక్కించి వాటికి ఆధార్ తరహా కార్డులను, వాటి ఆరోగ్య సంరక్షణకు మొబైల్ వ్యాన్‌లను ఏర్పాటు చేసే కొన్ని రాష్ట్రాల్లో రైతు భరోసా పొందుతున్న లబ్ధిదారి రైతులకు గోవుల్ని పెంచే విధంగా ఆయా గోవులకు కూడా ఈ సౌకర్యం అందితే గో సంరక్షణ మరింత సులభం అవుతుంది. అదే విధంగా విధంగా పార్లమెంట్‌లో చర్చించాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో హైందవ దళితసేన రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ పితాని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీ చందు స్వామీజీ, పితాని నంద గోపాల్, శ్రీ వెంకట దత్తనంద స్వామీజీ వారు, శ్రీ తురగా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## కోటి విష్ణు సహస్రనామం పారాయణం ప్రారంభం

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త



వన్ టౌన్ రాజప్ప నాయుడు వీధిలో గల శ్రీ గీతా ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో శ్రీ గీతా భవనంలో శ్రీ గీతా మందిరంలో సుదర్శన సహిత కోటి విష్ణు సహస్రనామం పారాయణం మంగళ ధ్వని వేదమంత్రములతో అత్యంత వైభవంగా ప్రారంభమైంది . ఈ ఉత్సవాన్ని అమ్మవారి ఉపాసకులు సిద్ధాంత శిరోమణి దైవజ్ఞ బ్రహ్మశ్రీ అక్కా జోస్యుల రమేష్ శర్మ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు . అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విష్ణు సహస్రనామాన్ని పారాయణం చేయడం వలన విశ్వశాంతి కలగడమే కాకుండా లోకం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు . పారాయణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పరమాత్మ యొక్క కృపను పొందే దిశగా పారాయణం చేయాలని పిలుపునిచ్చారు . ఉత్సవాన్ని తలపెట్టిన నిర్వాహకులను అభినందించి ఆశీస్సులను అందజేశారు . ప్రారంభంలో భాగంగా అఖండ జ్యోతి ప్రజ్వలన , గణపతి పూజ , పుణ్యాహవాచనం, రుత్విక్ వరుణ , దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ట , నవగ్రహ ఆరాధన, మండపారాధన, విశ్వరూప భగవానునికి అర్చనలు , ప్రత్యేక పూజలు , కుంకుమ అర్చనలు హోమములు, పరమేశ్వరునికి అభిషేకములు అర్చకులు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ , శ్రీ గీతా ప్రచార సమితి అధ్యక్షులు సిహెచ్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి జగన్ మోహనరావు , కార్యదర్శి ఎం వనజా దేవి , సంయుక్త కార్యదర్శి పి నూకరాజు , కోశాధికారి జివిఆర్ ప్రసాద్ , జి లక్ష్మీనరసింహ వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు , సభ్యులు స్థానికులు పరిసర ప్రాంత వాసులు వివిధ ప్రాంతాల నుండి భక్తులు విచ్చేశారు . పారాయణంలో పాల్గొన్న భక్తులు ముక్తకంఠంతో శ్రీ విష్ణు సహస్రనామాన్ని పారాయణం చేస్తున్నారు.

## కులాయి నీటిని పునరుద్ధరించాలని జీవీఎంసీకి బీజేపీ నేతలు వినతి



గాజువాక, మే 18, ప్రభాతవార్త:

అక్కిరెడ్డిపాలెం రైల్వే ట్రాక్ సమీప నివాసితులకు తాగునీటి కులాయిలను పునరుద్ధరించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు నేతృత్వంలో, గాజువాక ఇన్‌ఛార్జ్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర నేత పి.వి.ఎన్. మాధవ్ సూచనలతో తాము క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నామన్నారు. నీటి సరఫరా నిలిచిపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దాడి రమేష్, కృష్ణారెడ్డి బాధిత మహిళలు పాల్గొన్నారు.

## సకాలంలో కురవని వర్షాలు ముందుకుసాగని తొలకరి పనులు

పద్మనాభం, మే 18, ప్రభాతవార్త



శాస్త్రవేత్తలు చెప్పిన ప్రకారం వాతావరణంలో నెలకొన్న ఎలినినో ప్రభావం వల్ల పద్మనాభం మండలంలో వర్షాబావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో వర్షాలు ముఖం చాటేయడంతో ఈ సంవత్సరం తొలకరి పనులు ముందుకు సాగలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు వారాలు క్రితం కురిసిన వర్షాలకు కృష్ణాపురం, మద్ది, అనంతవరం, పాండ్రంగి, గెద్దపేట, పొట్నూరు, విలాసఖానపాలెం, విజయరామపురం, గందవరం తదితర గ్రామాలలో తొలకరి పంటలలో భాగంగా నువ్వుల విత్తనాలు చల్లారు. వర్షాలు లేక మొక్కలు భూస్థాయిలో ఉండిపోయాయి. అలాగే పలు గ్రామాలలో అసలు నువ్వులు చల్లలేదు. వేరుశనగ విత్తనాలు వెయడానికి వివిధ గ్రామాలలో దుక్కులే దున్నలేదు.అయితే నైరుతీ రుతుపవనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.వారం రోజులలో వర్షాలు పడకపోతే తొలకరి పంటలు లేనట్లేనని రైతులు తెలిపారు.

## విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు

మాధవధార, మే 18, ప్రభాతవార్త



విశాఖలో విద్యాసంస్థల బస్సులపై కొనసాగుతున్న ప్రత్యేక తనిఖీలలో భాగంగా సోమవారం ఏయూ మైదానంలో విద్యాసంస్థల బస్సులను అధికారులు ముమ్మరంగా తనిఖీ చేశారు.నగరవ్యాప్తంగా 22 మంది ఇన్స్పెక్టర్లతో ఈ తనిఖీలు చేపట్టారు.3టౌన్ పరిధిలో 20 బస్సులను అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గోవిందరావు పరిశీలించగా,ఎక్స్పైరీ అయిన ఫైర్ సిలిండర్లు ఉన్న 3 బస్సులకు నోటీసులు ఇచ్చారు. విద్యార్థుల భద్రత కోసమే ఈ చర్యలని ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు తెలిపారు.లోపాలను సరిచేసుకొని, సంబంధిత ఎంవీఐ/ఏఎంవీఐ సమక్షంలో డీటీసీ కార్యాలయంలో వాహనాలను సమర్పించాలని ఆదేశించారు.భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## గాజువాకలో వారాహి అమ్మవారి ప్రత్యేక పూజలు-ఘనంగా గోడపత్రిక ఆవిష్కరణ

గాజువాక, మే 18, ప్రభాతవార్త:



గాజువాక వడ్లపూడిలో జూలై 15 నుండి 24 వరకు శ్రీ వారాహి అమ్మవారి ప్రత్యేక పూజలు, హోమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు వేదపండితులు హరీష్ శర్మ తెలిపారు. మద్దిలపాలెంలోని బీజేపీ నేత పి.వి.ఎన్. మాధవ్ క్యాంపు కార్యాలయంలో ఈ పూజలకు సంబంధించిన గోడ పత్రికను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీష్ శర్మ మాట్లాడుతూ.. వడ్లపూడి మీసేవా కేంద్రం ఎదురుగా ఉన్న మైదానంలో పది రోజుల పాటు శాస్త్రోక్తంగా హోమాలు జరుగుతాయని, ఈ వేడుకలకు పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, గాజువాక ఇన్‌ఛార్జ్ కరణంరెడ్డి నరసింగరావు, కృష్ణారెడ్డి, రాజశేఖర్, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అక్కిరెడ్డిపాలెంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

### -పైడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా ఘనంగా సత్కారం



గాజువాక, మే 18, ప్రభాతవార్త:

జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో శ్రీ శ్రీ శ్రీ పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామానికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. 2025-2026 ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులతో పాటు రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీల్లో రాణించిన క్రీడాకారులను నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్కూల్ విద్యార్థులు జి. సాహితి (594), టి. సాయిప్రియ నిహారిక (589), జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వి.ఎస్.ఎస్. అధితి (591), జి. కోటలక్ష్మి (587), శ్రీ సాయిశర్వాణి స్కూల్ విద్యార్థులు పి. శశిప్రియ (582), ఎం. లావణ్య (565) మార్కులతో పురస్కారాలు అందుకున్నారు. అలాగే ఖో-ఖో పోటీల్లో ప్రతిభ చాటిన ఆర్. తరుణ్ కుమార్, ఆర్. దిల్లేశ్వరి, గిరీషలను అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ గుడివాడ అనూష, రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, బి.వి. రమణ, కె. రాంబాబు, పీటీ మాస్టర్ ఇస్మాయిల్ హాజరై విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణారావు, బొడ్డు గంగరాజు, బొడ్డు అప్పారావు నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలో గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వార్డుల పునర్విభజన తర్వాతే ఓటర్ల జాబితా ఇవ్వాలి

### -జేసీకి బీజేపీ వినతి

గాజువాక, మే 18, ప్రభాతవార్త:



జీవీఎంసీ వార్డులను 98 నుండి 120కి పెంచే ప్రక్రియలో భాగంగా, ప్రత్యేక ఓటర్ల సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పూర్తయిన తర్వాతే తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని బీజేపీ నాయకులు కోరారు. 'జనతా వారధి' ఆధ్వర్యంలో విశాఖ జాయింట్ కలెక్టర్ గొబ్బిల్ల విద్యాధరికి బీజేపీ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు నేతృత్వంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ సూచనల మేరకు ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని చెప్పారు. జిల్లాలోని చెరువుల్లో పూడికతీత పనులను వేగవంతం చేయాలని, దాని ద్వారా వచ్చే మట్టిని స్థానిక కుమ్మరులకు ఉచితంగా ఇవ్వాలని కోరారు. దీనివల్ల చేతివృత్తుల వారికి ఆర్థికంగా మేలు జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాడి రమేష్ నాయుడు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెన్నేటినగర్ పార్క్ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవంలో విష్ణుకుమార్ రాజు



విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త

సహకారంతో నగరపాలక సంస్థ తెన్నేటినగర్ పార్కులో వివిధ అభివృద్ధి పనులు దాదాపు 20 లక్షలు రూపాయల అభివృద్ధి పనులుఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ఎపి బిజెపి శాసనసభా పక్షనాయకులు శ్రీ విష్ణు కుమార్ రాజు గారి చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 50 వ వార్డ్ తెదేపా అధ్యక్షులు ఏపి కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ సనపల వరప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణుకుమార్ రాజు గారు మాట్లాడుతూ మాధవదార చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి తాను ఎంతైనా కృషిచేస్తానని అన్నారు. అలాగే విశాఖపట్నాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం క్రృషిచేస్తుందని అన్నారు.తదనంతరం పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల వితరణ విష్ణుకుమార్ రాజు గారి చేతులు మీదుగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారిని తెన్నేటినగర్ నివాసులు గజమాలతో ఘనంగా సత్కరించారు. జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి శ్రీ లొడగల క్రృష్ణ గారు, విశాఖ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు శ్రీ సురేష్ బాబు గారు, 50 వ వార్డ్ బిజెపి అధ్యక్షుడు శ్రీ కూన వెంకట్రావు, శ్రీ యు. అప్పలకొండ యాదవ్, వ్యవసాయ మార్కటింగ్ డైరెక్టర్ శ్రీమతి టి.పద్మజా తెన్నేటినగర్ అధ్యక్షుడు శ్రీ నంబాళ్ళ ఈశ్వరరావు, కార్యదర్శి శ్రీ శీపాన రాము, శ్రీ సనపల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విలాసఖానపాలెంలో ఘనంగా బంగారమ్మ తల్లి తొలేళ్ల సంబరం

పద్మనాభం, మే 18, ప్రభాతవార్త



మండలంలో విలాసఖానపాలెం గ్రామంలో కొలువు దీరిన బంగారమ్మ తల్లి తొలేళ్ల సంబరంను గ్రామ ప్రజలు సోమవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ముందుగా సాయంత్రం పూజారి రామశింగు సత్యమమ్మ అమ్మవారి ఘటాలను పూర్వ సాంప్రదాయ ప్రకారం మాదిగ డప్పులతో గ్రామంలో ఊరేగింపు కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం ఘటాలను గ్రామంలో బోని సన్యాసినాయుడు మాస్టారు ఇంటి వద్ద ఉన్న శతకం పట్టు వద్ద వేంచేయించారు. అక్కడ గ్రామ ప్రజలు అమ్మవారికి పూజలు చేసారు.

## సామాజిక సేవలో గాదె బాలాజీ చేస్తున్నా కృషి అభినందనీయం

### - ఘనంగా రాధా రంగ రాయల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గాదె బాలాజీ జన్మదిన వేడుకలు

### - శుభాకాంక్షలు తెలిపిన రాజకీయ,వ్యాపార, సంఘనాయకులు, అభిమానులు

### - బొగ్గు శ్రీను మిత్రమండలి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహణ

### - టెలి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాస్

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త



సామాజిక సేవలో గాదె బాలాజీ చేస్తున్నా కృషి అభినందనీయమని పలువురు అభినందించారు.సోమవారం రాధా రంగ రాయల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గాదె బాలాజీ జన్మదిన వేడుకలు బొగ్గు శ్రీను మిత్రమండలి ఆధ్వర్యంలో అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులు, సంఘ నాయకులు హాజరై బాలాజీకి శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక సేవా రంగంలో ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఉత్తర ఎం ఎల్ ఏ విష్ణు కుమార్ రాజు,వైకాపా నగర అధ్యక్షుడు కె కె రాజు, జై భారత్ నగర్ గ్రామ అధ్యక్షులు డా॥ బొగ్గు శ్రీను స్వయంగా బాలాజీని కలిసి జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు.మాజీ మంత్రి,భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాస్ అందుబాటులో లేకపోవడంతో టెలి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, "గాదె బాలాజీ" మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించి, నిరంతరం ప్రజా సేవలో నిమగ్నం కావాలని" ఆకాంక్షించారు. బాలాజీ జన్మదినాన్ని పురస్కరించుకుని బొగ్గు శ్రీను మిత్రమండలి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గం నలుమూల నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు నీరాజనాలు పలికారు. వేడుక ప్రాంతమంతా సందడిగా మారింది. ఈ వేడుకలో వివిధ సంఘాల నాయకులు,మాధవ ధార జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాపు సంఘం నాయకులు,కూటమి నాయకులు,జనసేన నాయకులు,వైకాపా నాయకులు, స్థానిక ప్రముఖులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు.

## తాటిపూడి రిజర్వాయర్‌ను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త



తాటిపూడి జలాశయం నుంచి జీవీఎంసీకి జరుగుతున్న నీటి సరఫరా వ్యవస్థను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం పరిశీలించారు. కృష్ణాపురం హెడ్‌వాటర్ వర్క్స్ నీటి శుద్ధి కేంద్రం, పంప్ హౌస్‌ను తనిఖీ చేసి నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. రానున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా సమృద్ధిగా ఉండేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తాటిపూడి నుంచి జీవీఎంసీకి రోజుకు 11 ఎంజీడీ ముడి నీరు సరఫరా అవుతోందని అధికారులు కమిషనర్‌కు వివరించారు. అనంతరం జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్క్ కార్యాలయాన్ని సందర్శించిన కమిషనర్, పరిశ్రమలకు అవసరమైన నీటి వినియోగంపై వివరాలు తెలుసుకుని సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ, విజయనగరం ఇరిగేషన్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ అప్పలనాయుడు, విస్కో ప్రతినిధి సుమన్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వీరయ్య, నీటి శుద్ధి కేంద్రం స్కాడా కాంట్రాక్టర్ రమేష్‌రాజు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## గాజువాకలో ట్రాఫిక్ జాతర!

### -పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలతో ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు

### -కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్.. ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు -రోడ్డుపై స్టేజీల ఏర్పాటుతోనే సమస్య -వాహనదారుల ఆగ్రహం -ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు విఫలం

గాజువాక, మే 18, ప్రభాతవార్త:



గాజువాక పోలిస్టేషన్ పరిధిలో ట్రాఫిక్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. జింక్ ప్రధాన ద్వారం సమీపం శ్రీ శ్రీ శ్రీ పెంటమాంబ అమ్మవారి ఆలయ పండగ మహోత్సవాల సందర్భంగా సోమవారం గాజువాక ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆలయ ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైనే భారీ స్టేజీలు, పండగ ఏర్పాట్లు చేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పెంటమాంబ అమ్మవారి గుడి నుంచి కోరమండల్ గేట్ వరకు దాదాపు కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దాదాపు రెండు గంటలకు పైగా వాహనాలు కదలని స్థితిలో ఉండిపోవడంతో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు, అత్యవసర ప్రయాణికులు తీవ్ర నరకయాతన అనుభవించారు.

### పోలీసుల వైఫల్యంపై మండిపాటు..

ఇంత పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుగుతున్నప్పటికీ, ముందస్తుగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టడంలో స్థానిక ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని వాహనదారులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు కూడా సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి, పండగ ముగిసే వరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని,ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

## '1 నిమిషం - 4 డబ్బాలు' అవగాహన కార్యక్రమం ప్రారంభం

### చెత్తను నాలుగు రకాలుగా విభజించి అందించాలని ప్రజలకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపు



విశాఖపట్నం, మే 18, ప్రభాతవార్త:

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో "1 నిమిషం -- 4 డబ్బాలు" పేరుతో ప్రత్యేక ప్రజా అవగాహన కార్యక్రమాన్ని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం ప్రారంభించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తడి, పొడి, హానికర, ప్రత్యేక వ్యర్థాలుగా నాలుగు వేర్వేరు డబ్బాలలో విభజించి పారిశుధ్య కార్మికులకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో విశాఖ నగరాన్ని దేశంలోనే పరిశుభ్ర నగరంగా నిలపాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. "స్వచ్ఛ సేవకులు" ప్రతి ఇంటికి వెళ్లి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పిస్తారని, ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. తడి చెత్తను ఆకుపచ్చ డబ్బాలో, పొడి చెత్తను నీలం డబ్బాలో, హానికర చెత్తను ఎరుపు డబ్బాలో, ప్రత్యేక చెత్తను నలుపు రంగు డబ్బాలో వేయడం ద్వారా వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ సులభమవుతుందని కమిషనర్ వివరించారు.

## కూటమి హామీలను అమలు చేయాలి: సిపిఐ డిమాండ్

గాజువాక,మే 18,ప్రభాతవార్త:



ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ సచివాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి, అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వడంలో విఫలమయ్యాయన్నారు. 2014 నాటి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంచలేదని, పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాల హామీని అటకెక్కించారని మండిపడ్డారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న లక్షలాది రేషన్ కార్డులు, పెన్షన్ల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, టి. కామేశ్వరరావు, జి. జయ, టి. గోపి, ఎస్. లక్ష్మి, బి. వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య రంగంలో అనకాపల్లిని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం

### త్వరలో అత్యాధునిక ఎం ఆర్ ఐ స్కాన్ సౌకర్యం ఏర్పాటు చేస్తాం : ఎంపీ డా. సీఎం రమేష్

అనకాపల్లి, ప్రభాతవార్త



ఆరోగ్య రంగంలో అనకాపల్లిని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో పనిచేస్తున్నామని అనకా పల్లి పార్లమెంట్ సభ్యులు డా.సీఎం రమేష్ అన్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయంలో పార్లమెం టు సభ్యులు సీఎం రమేష్ ప్రత్యేక చొరవతో మీగ్నేసిత ఇండియా లిమిటెడ్ సంస్థ సి ఎస్ ఆర్ నిధుల ద్వారా రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పేషంట్ వెయిటింగ్ హాల్, బేబీ ఫీడింగ్ రూమ్, డి-అడిక్షన్, రిహాబిలిటేషన్ సెంటర్ల ను ఎంపీ సీఎం రమేష్, మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాజమండ్రి సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ లు సోమవారం ఘనంగా ప్రారంభించారు. అదేవిధంగా 2025-26 సంవత్సరానికి గాను ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన రూ.6 లక్షల వ్యయంతో ఆర్వో వాటర్ ప్లాంట్ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ సి.ఎం.రమేష్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సిఎస్ఆర్ నిధులను జిల్లా అభివృద్ధికి వినియోగిస్తు న్నామని తెలిపారు. ఆరు నెలల్లో పూర్తి చేయాల్సిన నిర్మాణ పనులను కేవలం 80 రోజుల్లోనే పూర్తి చేసి సంస్థ కమిట్మెంట్ను చాటిందని పేర్కొంటూ, మీగ్నేసిత ఇండియా లిమిటెడ్ సంస్థ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఎన్టీఆర్ ఆసుపత్రికి వచ్చే వేలాది మంది రోగులు, వారి సహాయకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎంపీ నిధులతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానిక అవసరాలను గుర్తించి తక్కువ సమయంలోనే దీనిని అందుబాటులోకి తీసుకువచ్చిన అధికారులను అభినందించారు. ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కాన్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, దాదాపు రూ.5 నుంచి రూ.6 కోట్ల వ్యయంతో అత్యాధునిక ఎంఆర్ఐ స్కాన్ ఏర్పాటు చేయడానికి అవసరమైన నిధులను సమీకరించి త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ వివిధ పరిశ్రమలు సిఎస్ఆర్ నిధులతో ముందుకు వస్తే మోడ్రన్ అనకాపల్లి నిర్మాణం సాధ్యమవుతుందని, ఆరోగ్య రంగంలో అనకాపల్లి జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జిల్లాలో పరిశ్రమల సిఎస్ఆర్ నిధులను ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, ప్రజా అవసరాల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సదుపాయాలు రోగులకు, వారి సహాయకులకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య రంగాభివృద్ధికి పరిశ్రమలు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని అన్నారు. ఆసుపత్రుల్లో మౌలిక పాయాల అభివృద్ధి, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తాతయ్య బాబు, మల్ల సురేంద్ర, ఉమ్మడి విశాఖ మాజీ టీడీపీ జిల్లా అధ్యక్షులు దాడి రత్నాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపూరెడ్డి పరమేశ్వరరావు, మీగ్నేసిత ఇండియా లిమిటెడ్ హెడ్ నాగేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ హైమావతి, డీసీహెచ్ఎస్ డా.శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రవికుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి మే 18, ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా నలుమూలన అనేక వ్యాధులతో ఇబ్బంది పడుతూ వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సూచించారు. సోమవారం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పటల్ నందు ఆయన ఆకస్మిక పర్యటన చేసి ఆస్పటల్ పేషెంట్స్‌తో మాట్లాడుతూ హాస్పిటల్లో అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్ మెయింటినెన్స్, హాస్పటల్లో, ఆపరేషన్ థియేటర్లో నిర్వహిస్తున్న పరిశుభ్రతను, పేషంట్స్ అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ హాస్పిటల్‌కి వచ్చే పేషెంట్స్‌కి మెరుగైన వైద్యం అందించాలని, మందులు కొరత ఉండరాదని, పరిశుభ్రత పాటించాలని, ఇలాంటి విషయాలో ఉపేక్షించేది లేదని వైద్య సిబ్బందికి, కాంట్రాక్టర్లకు తెలియజేశారు.

## కలెక్టరేట్‌లో ఆయుష్ ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహణ



అనకాపల్లి, మే 18, ప్రభాతవార్త

జిల్లా కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్) నిర్వహించే రోజున ఆయుష్ ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సూచనల మేరకు సోమవారం ఉదయం కలెక్టరేట్లో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలియజేశారు. ప్రతి సోమవారం ప్రజలకు అందుబాటులో ఆయుర్వేదం, హోమియోపతి సేవలు అందించడం జరుగుతుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచే మందుల పంపిణీతో పాటు బీపీ చెక్ అప్, మోకాళ్ళ నొప్పులు, ఆయాసం, దగ్గు, నీరసం, ఎసిడిటీ, మధుమేహం, వంటి వ్యాధులకు మందులు, సన్ స్ట్రోక్ నకు ప్రివెంటివ్ మందులు పంపిణీ చేసినట్లు రోగులను తనిఖీ చేయడానికి హోమియోపతి మెడికల్ అధికారి నీ నియమించినట్లు కలెక్టర్ తెలియజేశారు.

## పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

ఎలమంచిలి, మే 18, ప్రభాతవార్త



పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలంటూ వైఎస్ ఆర్సిపి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ర్యాలీ నిర్వహించి అనంతరం తహశీల్దార్ వరహాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు మాట్లాడుతూ పెరుగు తున్న ఇంధన ధరలు సామాన్య ప్రజలు, ఆటో కార్మికులు, రైతులు మధ్య తరగతి కుటుంబాలపై తీవ్ర భారం మోగుతున్నాయని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వ నిలబెట్టుకోవాలని వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలు కారణంగా నిత్యవసర వస్తువులు ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం కష్టతరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కోలా గురువులు, నియోజవర్గ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ



అనకాపల్లి మే 18, ప్రభాతవార్త

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ హెచ్చరిం చారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డి.ఎస్.పి ఎం.శ్రావణి ఆదేశాల మేరకు, అనకాపల్లి టౌన్ పరిధిలో ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట నారాయణ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ద్విచక్ర వాహనాలను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ, అజాగ్రత్తగా, అధిక శబ్దం చేస్తూ, నెంబర్ ప్లేట్లు లేకుండా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారిని గుర్తించి పట్టుకున్నారు. ఇలాంటి వాహనదారులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వాహనాలు నడిపిన వారిపై ఐదు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజల ప్రాణాలకు, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పాటించ కుండా వాహనాలు నడిపే వారిపై ఇదే విధంగా కఠిన చర్యలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.

## గుంతలమయమైన రోడ్డుతో ప్రమాదాలు

### తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజా సంఘాల డిమాండ్



అచ్చుతాపురం, మే 18, ప్రభాతవార్త

అచ్చుతాపురం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు నుంచి భోగాపురం వెళ్లే రహదారిలో వాటర్ పైప్‌లైన్ పనుల కోసం రోడ్డు తవ్వి తిరిగి పునరుద్ధరణ చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి గుంతల మయంగా మారడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, ఐద్వా మండల కన్వీనర్ రొంగలి లక్ష్మి మాట్లాడుతూ మండల కేంద్రానికి అనుసంధానంగా ఉన్న ఈ రహదారిపై మడుతూరు, అప్పన్నపాలెం, జంగులూరు ప్రాంతాల ప్రజలతో పాటు అపార్ట్మెంట్ల నివాసితులు, కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, కంపెనీ కార్మికులు వందల సంఖ్యలో నిత్యం ప్రయాణిస్తున్నారని తెలిపారు. రోడ్డు పూర్తిగా గుంతలతో నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని, పలువురు గాయపడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారిని మరమ్మతు చేసి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, చుక్క నాగేశ్వరరావు, పారిపల్లి సోమునాయుడు, ఈ.యశోద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా బైక్‌ను తాడుతో లాగిన సీఐటీయూ నాయకులు

అచ్చుతాపురం మే 18 ప్రభాతవార్త



అచ్చుతాపురం ఎస్ఈజెడ్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వ ర్యంలో సోమవారం వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. బైక్‌కు తాడు కట్టి లాగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రాము మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల దేశవ్యాప్తంగా ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఇంధన ధరలు పెరగడం వల్ల కేవలం వాహనదారులకే కాకుండా ప్రతి సామాన్యుడిపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఇంధన ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు అధికమై కూరగాయలు, పాలు, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. దీంతో సామాన్య ప్రజల నెలవారీ కుటుంబ బడ్జెట్ దెబ్బతింటోందన్నారు. డీజిల్ ధరల పెరుగుదల కారణంగా ట్రాక్టర్లు, పంపుసెట్ల వినియోగ వ్యయం పెరిగి రైతులపై అదనపు భారం పడుతోందని చెప్పారు. అలాగే బస్సు ఛార్జీలు, ఆటో అద్దెలు పెరగడంతో ప్రజల ప్రయాణ ఖర్చులు కూడా భారమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వస్తువుల ఉత్పత్తి, పంపిణీ ఖర్చులు పెరగడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా సామాన్య ప్రజలపై భారం మోపుతున్నాయని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూరేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, ప్రజల అవసరంగా మారిన వాహనాల ఇంధనంపై ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్నాయని ఆరోపించారు. ఈ విధానాలను ప్రభుత్వం మార్చుకోకపోతే ప్రజలు తిరుగుబాటు చేయా ల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో లభించే ఆయిల్ నిక్షేపాలను ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పగించి, మరోవైపు ప్రజలకు పొదుపు చర్యలు చేపట్టాలని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు లాలం నర్సింగరావు, శ్రీను, సత్యం, రాము, రాజు, వాసు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో వార్డుల విభజనపై ముసాయిదా ప్రతిపాదన విడుదల



ఎలమంచిలి, మే 18, ప్రభాతవార్త

మున్సిపాలిటీలో వార్డుల విభజనపై ముసాయిదా ప్రతిపాదన సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు, సచివాల సిబ్బందితో ముసాయిదాను విడుదల చేశారు. పురపాలక సంఘం పరిధిలో వార్డుల పునర్విభజన ప్రక్రియ వేగవంతమైంది. ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టం 1965, ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం.64 మార్గదర్శకాలకు అనుగుణంగా, పట్టణంలోని వార్డుల సంఖ్యను ప్రస్తుతమున్న 25 నుండి 32కు పెంచుతూ ముసాయిదాను సిద్ధం చేశారు. పెరిగిన జనాభా, ఓటర్ల సంఖ్యను ప్రాతిపదికన తీసుకుని ఈ విభజనను రూపొందించినట్లు కమిషనర్ ప్రసాద్ రాజు వెల్లడించారు. ఈ పునర్విభజన ముసాయిదా ప్రతిపాదనలను ఇప్పటికే పురపాలక సంఘ కార్యాలయంతో పాటు, స్థానిక తహసీల్దార్ కార్యాలయం, అన్ని వార్డు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచారని తెలిపారు. ఈ ప్రతిపాదిత వార్డుల పునర్విభజనపై ప్రజలు తమ అభ్యంతరాలను, సలహాలను లేదా సూచనలను రాతపూర్వక రూపంలో సమర్పించేందుకు అవకాశం కల్పించారు. ఆసక్తి గల వారు ఈ ప్రకటన వెలువడిన ఏడు రోజుల గడువులోగా, అంటే మే 25, 2026 సాయంత్రం 5 గంటలలోపు తమ అభిప్రాయాలను యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌కు నేరుగా అందజేయాలని అన్నారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత అందే ఎలాంటి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని కమిషనర్ ప్రసాద్ రాజు స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, వార్డుల విభజన ప్రక్రియలో తమ అభిప్రాయాలను పంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

## 20న అనకాపల్లి జిల్లాలో మందుల దుకాణాలు బంద్

అనకాపల్లి మే 18, ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లాలో ఈనెల 20న మందుల దుకాణాలు బంద్ నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వంకాయల ఈశ్వర రావు, కార్యదర్శి ఎంఎస్ ప్రకాష్ గుప్తా, కోశాధికారి వై సతీష్ కుమార్ తెలిపారు. అనకాపల్లిలో సోమవారం జరిగిన అనకాపల్లి జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ దేశయంగా సుదీర్ఘకాలంగా సుమారు 12 లక్షల 47 వేల మందుల దుకాణాలను నిర్వహిస్తూ, వాటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన సుమారు నాలుగు కోట్ల మంది భారతీయులను ఇబ్బందులు పాలు చేసే విధంగా నిర్వహిస్తున్న మందుల ఆన్లైన్, కార్పొరేట్, నిషేధిత, నకిలీ ముందుల అమ్మకాలకు నిరసనగా ఈనెల 20వ తేదీ బుధవారం దేశవ్యాప్త సమ్మె లో భాగంగా అనకాపల్లి జిల్లాలో కూడా అన్ని మందుల దుకాణాలను మూసివేస్తున్నామని తెలిపారు. దేశంలో ప్రవేశించిన ఆన్లైన్ ముందుల అమ్మకాలు, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్ లు ఆఫర్ల పేరిట జరుగుతున్న మోస పూరిత వ్యాపారాలు, నిషేధిత, నకిలీ ముందుల విక్రయాలతో దేశీయంగా సాంప్రదాయ మందుల దుకాణాల యజమానులు వీటిపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడిన వారు పెద్ద ఎత్తున ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మెకు జాతీయ స్థాయిలో ఉన్న సంఘాలు అన్నీ పిలుపునిచ్చాయన్నారు. ఆల్ ఇండియా సమ్మెలో భాగంగా జిల్లాలో కూడా అన్ని మందుల దుకాణాలను మూసివేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో మందులు వాడుతున్న వారు, అత్యవసర పరిస్థితుల్లోనూ ఎవరూ ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమ్మెకు అందరూ సహకరించి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. దేశంలో ఉన్న సుమారు 12.47 లక్షల దుకాణాలపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి ఉన్న నాలుగు కోట్ల మంది జీవనం కోసం చేస్తున్న ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సమ్మె గోడ, కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పెతకశీశెట్టి శివ సత్యనారాయణ, పరమేశ్వరరావు, రాము, సూర్యనారాయణ, రాజేష్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ ధరలు పిలుపుపై... వైయస్సార్ సిపి ఆందోళన

గొలుగొండ మే 18 ప్రభాతవార్త

పెట్రోల్ డీజిల్ ధరలు పెంపుపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు కొరుప్రోలు ఫణి శాంతారాం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళనలో ప్రభుత్వ తీరును ఎండగడుతూ సామాన్యుల పై ధరలు భారం మోపి బ్రతుకు భారం చేస్తుందని ఆరోపించారు. నిత్యవసర గా మారిన పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడంతో నిత్యవసర సరుకులపై భారం రేట్లు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని లీటర్ కు మూడు రూపాయలు ఒకేసారి పెంచడం అన్యాయమని విమర్శించారు. ఏలే వారికి బుద్ధి లేకుండా హద్దులు దాటి సామాన్యుల బ్రతుకులపై పెట్రోబారం మోపుతున్నారని అన్నారు. అనంతరం తహసిల్దార్ కాకర నూకరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మాజీ సర్పంచులు, వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.







## గొలుసు కట్టు చెరువులు ఆధునీకరణ పనులు పరిశీలన



గోల్కొండ మే 18 ప్రభాతవార్త

సాగునీటిని మెరుగుపరిచేదుకు ప్రభుత్వం నీటిపారుదల శాఖ ద్వారా చెరువుల ఆధునీకరణ పనులు చేపట్టినట్లు ఎంపీడీవో ఉలపాల శ్రీనివాస రావు అన్నారు. జనసేన నాయకులు బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన సూర్యచంద్రతో కలిసి సిహెచ్ నాగపురం పంచాయతీలో పాలెపు చెరువును ఆయన సందర్శించారు. గొలుసు కట్టు చెరువుగా ఆధునికరిస్తున్న పనులను పరిశీలించి స్థానిక శ్రామికులతో మాట్లాడారు. పని సమయంలో అందుతున్న కొత్త వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి శ్రామికులకు తగు జాగ్రత్తలు, గ్రామంలో పారిశుధ్యంపై అవగాహన తడి, పొడి చెత్త వేరుచేయడం ప్లాస్టిక్, పేపర్లు స్వచ్ఛ రథంనకు అందజేసి తగిన నిత్యవసరాలు తీసుకోవాలని సూచించారు. జనసేన నాయకులు రేగుబళ్ళ సాంబశివ, నీటిపారుదల శాఖ రవిచంద్ర, ఏపీవో సూర్య మనణి, కూటమి నాయకులు బొప్పన ప్రసాద్, ముఖ్య నాయకులు, శ్రామికులు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి- మండల వైసీపీ డిమాండ్

మాకవరపాలెం మే 18 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై అధిక భారాన్ని మోపే విధంగా పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం సరికాదంటూ మండల వైసీపీ అధ్య క్షులు చిటికెల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద మండల వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలు డీజిల్ ధరలు పెంపకంపై రాష్ట్ర వైఎస్ఆర్సిపి పిలుపుమేరకు మాకవరపాలెం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రెవెన్యూ కార్యాలయం ఎదురుగా పార్టీ జెండాలతో వైఎస్ఆర్సిపి మండల నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చిటికిల వెంకటరమణ మాట్లాడుతూ సామాన్యుల నడ్డి విరిసే విధంగా పెట్రోల్ డీజిల్ పెంచడం పట్ల ఆయన అసహనం వ్యక్తపరిచారు. పెట్రోలు డీజిల్ రేట్లు పెంచడం వలన నిత్యవసర సరుకులు పై దాని ప్రభావం పడి నిరుపేద మధ్యతరగతి కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేసి పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆయన ఈసందర్భంగా డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన పాలనతో సామాన్య ప్రజలకు గుడి బంధగా మారిందన్నారు. కనీసం సామాన్య ప్రజలకు అత్యవసరమైన గ్యాస్ ను చైతన్ సరఫరా చేయలేని స్థితిలో ప్రభుత్వ పనితీరు ఉందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సంక్షేమం అభివృద్ధి అనే పేరుతో పాలన చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజలను పూర్తిస్థాయిలో మోసం చేసింది అంటూ వెంకటరమణ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించి సామాన్యులకు న్యాయం చేయాలని ఈసందర్భంగా వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహల్దారుకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు(సర్వం) వైఎస్ఆర్సిపి మండల మాజీ అధ్యక్షులు రుత్తల వాసు, వైస్,ఎంపీపీ రాజారావు,మాజీ ఎంపీపీ రుత్తల సత్తిబాబు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గొంతెన హరిబాబు, పెట్ల దొరబాబు, రుత్తల శీను, భీమిరెడ్డి గోవింద, పాశెపు నాగేశ్వరరావు, చిటికెల బాబు,బుడ్డా రమణ, చినబాబు, అధిక సంఖ్యలో మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కూటమి ప్రభుతం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి



ఎస్ రాయవరం, మే 18, ప్రభాతవార్త

పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పార్టీ పిలుపుమేరకు నాయకులు కార్యకర్తలు అడ్డరోడ్డు జంక్షన్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ, నిరసనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు సక్రమంగా నిర్వహించలేదు, రెండేళ్ల పాలల్లో పెట్రోలు డీజిల్ ధరలు పెంచడం దారుణం అన్నారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలన్నారు. అనంతరం అడ్డరోడ్డు ఆర్డిఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ,చిక్కాల రామారావు, నక్కపల్లి జెడ్ పి టి సి కాసులమ్మ, ఎస్ రాయవరం వైస్ ఎంపీపీ అప్పన్న, ఎస్ రాయవరం మండల పార్టీ అధ్యక్షులు మధువర్మ నియోజవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి వైకాపా రాష్ట్ర నేత వీసం

నక్కపల్లి,ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను తక్షణమే తగ్గించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ,విశాఖ దక్షిణ నియోజక వర్గం ఇంచార్జ్ వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో రామకృష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నక్కపల్లి మండలం నుంచి వైకాపాశ్రేణులు తరలి వెళ్లిన సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రజలు అనేకమైన సమస్యల మీద సతమతం అవుతున్న సందర్భంలో మరోపక్క గ్యాస్ దొరక్క అవస్థలు పడుతున్న పరిస్థితుల్లో పెట్రోల్, డీజిల్ పెంచడం దారుణమని రామకృష్ణ అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆలోచించి ఉపసంహరించుకోవాలని, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు పూర్తిస్థాయిలో ప్రజలకు మేలు కలిగే విధంగా తగ్గించాలని కోరారు. ఆయనతోపాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోసలకాసులమ్మ, వెలగ ఈశ్వరరావు, గొర్ల గోవిందు, పొడగట్ల పాపారావు, కాకర వెంకటరావు, ఎలమంచిలి చందు ,తల్లా భార్గవ్ ,వెలగ రమేష్ ,తూము ప్రసాద్, ఎల్లేటి సత్యనారాయణ ,గంట తిరుపతిరావు ,పిక్కి తాతయ్యలు, దేశెట్టి గంగా నాగేశ్వరరావు, రాజయ్యపేట సూరిబాబు, తదితరులు ఉన్నారు.

## అద్దె చెల్లించని యూకో బ్యాంక్‌పై చర్యలు తీసుకోవాలి

### : పి.ఎ.సి.ఎస్ చైర్మన్ డిమాండ్



గూడెం కొత్తవీధి, మే 18, (ప్రభాతవార్త)

గత 11 ఏళ్లుగా అద్దె చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న యూకో బ్యాంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని, తమ భవనాన్ని ఖాళీ చేయించాలని పి.ఎ.సి. ఎస్ జీకే వీధి చైర్మన్ మొట్టడం నూకరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సొసైటీ సీఈవో చిన్నబ్బాయితో కలిసి సోమవారం జీకే వీధి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ఆయన ఫిర్యాదు చేశారు .ఈ సందర్భంగా చైర్మన్ నూకరాజు మాట్లాడుతూ.. జీకే వీధి కోఆపరేటివ్ సొసైటీ భవనాన్ని 2013లో నెలకు రూ.1,500 అద్దె చెల్లించే ఒప్పందంతో యూకో బ్యాంక్ తీసుకుందని తెలిపారు. అయితే, గత 11 సంవత్సరాలుగా బ్యాంక్ యాజమాన్యం అద్దె చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు నోటీసులు జారీ చేసినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు . ఇప్పటికైనా పూర్తి అద్దె బకాయిలను చెల్లించి, భవనాన్ని ఖాళీ చేసి సొసైటీకి అప్పగించాలని గ్రీవెన్స్‌లో కోరి నట్లు చెప్పారు. సొసైటీ సీఈవో చిన్నబ్బాయి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన ధరల పెంపుపై వైఎస్సార్‌సీపీ నేత బొబ్బిలి లక్ష్మణ్ ఆగ్రహం:

### ఇంధన పన్నులు తగ్గించాలని డిమాండ్...



గూడెం కొత్తవీధి, మే 18, (ప్రభాతవార్త)

దేశవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య ప్రజలపై తీవ్ర భారాన్ని మోపుతున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగ కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఇంధన ధరలను అదుపు చేయాలని ఆయన కోరారు.పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావం రవాణా రంగంపై పడి, మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని బొబ్బిలి లక్ష్మణ్ పేర్కొన్నారు. దీనివల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు రోజువారీ జీవనంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరంతరం పెరుగుతున్న పెట్రో భారం వల్ల సమాజంలోని వివిధ వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా పెట్టుబడి వ్యయం పెరిగి రైతులు, రోజువారీ సంపాదన కోల్పోతూ ఆటో డ్రైవర్లు, కార్మికులు మరియు మధ్యతరగతి ప్రజలు ఈ ధరల పెరుగుదల వల్ల నలిగిపోతున్నారని ఆవేదన చెందారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని బొబ్బిలి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రజల ఇబ్బందులు, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇంధనంపై విధిస్తున్న పన్నులను తగ్గించి, ధరలను తక్షణమే అదుపులోకి తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## శ్రీ మోదకొండమ్మ జాతరలో

## బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రదర్శన

### ప్రదర్శనను ఘనంగా జ్యోతి ప్రజ్వలన గవించి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ నిశాంతి



పాడేరు, మే 18, (ప్రభాతవార్త)

స్థానిక అశేష భక్తజనావళి ఎంతగానో ఎదురుచూసే ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకొని భక్తుల కోసం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయని, అమ్మవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచేందుకు, అమ్మవారి గుడి ఎదురుగా ఉన్న ఓపెన్ ఆడిటోరియంలో బ్రహ్మకుమారీస్ ఓం శాంతి సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృహత్తర ఆధ్యాత్మిక జ్ఞాన విజ్ఞాన చిత్ర ప్రదర్శనను సోమవారం ఘనంగా జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతిముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. భక్తులను ఎంతగానో ఆకట్టుకునేలా ఈ ప్రదర్శనలో పలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.?108 శివలింగాల అలంకరణ, భక్తుల దర్శనార్థం ఏకకాలంలో 108 శివలింగాలను ఇక్కడ కొలువుదీర్చారు.?స్వర్ణిమ భారతదేశ నమూనా, భారతదేశ ప్రాచీన వైభవాన్ని, ఆధ్యాత్మిక ఉన్నతిని చాటిచెప్పే స్వర్ణిమ భారత దేశ నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.?ఆధ్యాత్మిక జ్ఞాన విజ్ఞాన చిత్ర ప్రదర్శన, మానసిక ప్రశాంతతకు, జీవిత విలువలకు సంబంధించిన చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు.ఆధ్యాత్మిక విలువలతో కూడిన సన్ ఫ్లవర్ సెల్ఫీ పాయింట్, జాతరకు వచ్చే యువత, భక్తుల కోసం నైతిక విలువలను చాటిచెప్పే అందమైన 'సన్ ఫ్లవర్ సెల్ఫీ పాయింట్'ను సిద్ధం చేశామన్నారు. ఈ ప్రదర్శన తిలకించేందుకు విచ్చేసిన ప్రముఖులు, ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాడేరు మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి,పాడేరు ఐటీడీఏ అధికారిగా గతంలో పనిచేసిన అభిషేక్, రాష్ట్ర సాంస్కృతిక కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ గంగులయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతర ముగిసేవరకు ఈ ప్రదర్శన భక్తులకు అందుబాటులో ఉంటుందని, కావున భక్తులందరూ ఈ ఆధ్యాత్మిక ప్రదర్శనను తిలకించి, అమ్మవారి కృపతో పాటు మానసిక ప్రశాంతతను పొందాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

## జాతర లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉచిత మజ్జిగ పంపిణీ



పాడేరు, మే 18, (ప్రభాతవార్త)

మన్యం ఆరాధ్యదైవం శ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవాలు పాడేరులో ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా సాగుతున్నాయి.అమ్మవారిని దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తుల సేవలో స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఆదివారం, సోమవారం ముందుకొచ్చింది. జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నాడు ఎండ తీవ్రతను సైతం లెక్కచేయక తరలివచ్చిన వేలాది మంది భక్తులకు బ్యాంకు ఆధ్వర్యంలో చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. అమ్మవారి కృపతో తోటి జీవులకు సేవ చేయడమే పరమార్థంగా భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.?ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ సంగ్రామం జిత్ సహో మాట్లాడుతూ, ఏటా అత్యంత పవిత్రంగా జరిగే మోదకొండమ్మ తల్లి జాతరలో భక్తులకు సేవ చేసే భాగ్యం కలగడం పూర్వజన్మ సుకృతమని కొనియాడారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల దాహం తీర్చి, వారిలో ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని నింపడానికే బ్యాంకు తరఫున ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పండగ రెండవ రోజైన మంగళవారం కూడా ఈ మజ్జిగ పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతుందని, భక్తుల సేవలో భాగస్వాములు కావడం తమకు ఎంతో తృప్తిని ఇచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఎండ వేడిమిలో అలసిపోయిన భక్తులకు మజ్జిగ అందిస్తూ బ్యాంకు సిబ్బంది చూపిన సేవాభావం అందరిలోనూ స్ఫూర్తిని నింపింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ మేనేజర్ సంగ్రామం జిత్ సహో,డి. ఎమ్.ఎన్. శ్రీనివాస్, కుమార్, సోములు, శివ రామకృష్ణ, శ్రీనివాస్ నాయుడు, మూర్తి, కిరణ్, శివ, మన్మధ్, సూర్య, బహుగుణ,సత్యనారాయణ, నిరుపమతో పాటు పెద్ద సంఖ్యలో బ్యాంకు ఖాతాదారులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## వేలాది మందితో భారీ అన్న సమారాధన



పాడేరు, మే 18, (ప్రభాతవార్త)

పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారి మూడు రోజులు జాతర మహోత్సవములు కొరకు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థంరోజు 3000 నుండి 4000 మంది వరకు భారీ అన్నదాన కార్యక్రమం విశాఖపట్నం స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ వారి ఆర్థిక సహాయంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు సల్లా రామకృష్ణ, తమర్భ ప్రసాదరావు నాయుడు కొణతాల సతీష్, కిల్లు చంద్రమోహన్ కుమార్ ,గూడెపు సూర్య ప్రకాష్, లకే రత్నబయి, పలాసి రమణమ్మ పురుష లక్ష్మయ్య, కూర రాము, దిలీప్ కుమార్ ,పాల్గొన్నారు అలాగే మూడో రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నది కావున భక్తులందరు వచ్చి అన్న ప్రసాద కార్యక్రమాన్ని స్వీకరించి అమ్మవారు ఆశీస్సులు పొందవలసిందిగా కోరి ప్రార్థిస్తూ ఉన్నామన్నాడు.



## రోడ్డు కి అడ్డదిడ్డంగా చిన్ను వైన్స్ వాహన పార్కింగ్

### రోడ్డును సగానికి ఆక్రమించి మద్యం సరుకును దించుతున్న చిన్ను వైన్స్




అరకులోయ, మే 18, ప్రభాతవార్త:

పర్యాటక కేంద్రమైన అందాల అరకులోయ లో మద్యం దుకాణాలకు సంబంధించిన వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నాయి. నిత్యం ఇటు పర్యాటకులు , అటు స్థానిక వాహనాలతో రద్దీగా ఉండే అరకులోయ ప్రధాన రహదారిలో చిన్ను వైన్స్ కు చెందిన వాహనం రోడ్డుని సగానికి పైగా ఆక్రమించి పార్కింగ్ చేసి సరుకును దించుతుండ డంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు పోలీస్ శాఖ రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, మరోవైపు ఇవేవీ పట్టనట్లు చిన్ను వైన్స్ వ్యవహరిస్తూ సరుకును దించేందుకు తమ వాహనాన్ని రోడ్డుకి అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. తమను ఎవ్వరూ అడిగేవారు లేరన్న ధీమాతో ప్రధాన రహదారిలో రోడ్డుని ఆక్రమించి మద్యం సరుకును దించుకోవడంతో ఇతర వాహనదారులు చిన్ను వైన్స్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీస్ శాఖ , ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టాలని స్థానికులు వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు .

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం పై 20,21 తేదీల్లో నిరసన

పాడేరు, మే 18, (ప్రభాతవార్త)

ప్రభాతవార్త:ఏపీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ నెల 20,21 వ తేదీల్లో విద్యుత్తు బస్సులను ఆర్టీసీ ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలనీ ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనీ,స్త్రీ శక్తి బస్సులలో జీరో టికెట్టు ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేసి, మిగతా ప్రయాణీకులకు టిక్కెట్టు ఇచ్చే విధంగా చర్యలు తీసుకొవాలని, సిబ్బందిపై పనిభారం తగ్గించాలనీ,పీ ఆర్ సి కమిటీని నియమించి ఐఆర్ ను వెంటనే ప్రకటించాలనీ,పెండింగ్లో ఉన్న 4 డి ఎ లు, అరియర్స్ లీవ్ ఎనాక్యాష్మెంట్లు ఇవ్వాలలని ఈ నెల13న ప్రభుత్వానికి,ఆర్టీసీ యం.డి.కి వినతి పత్రం అందజేసినట్టు నాయకులు పేర్కొన్నారూ.ప్రయాణీకులకు సరిపడా కొత్త బస్సులు వెంటనే కొనుగోలు చేయాలనీ, అన్ని కేటగిరీలలో ఖాళీలను భర్తీ చేయాలనీ,రిటైర్ అయిన, చనిపోయిన సిబ్బందికి వెంటనే సెటిల్మెంట్స్ చేయాలనీ,ఉద్యోగులను ఈ హెచ్ ఎస్ నుండి మినహాయించి గతంలో ఆర్టీసీ నందు ఉన్న వైద్య సదుపాయం అమలుచేయాలనీ పాడేరు డిపో మేనేజర్ వినతి పత్రం అందజేసినట్టు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పాడేరు డిపో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి.రమణ, జిల్లా ప్రెసిడెంట్ బి ఎస్ నారాయణ,జిల్లా సెక్రెటరీ జి.వి రమణ, డిపో ప్రెసిడెంట్ తురక గంగాధర్ డిపో సెక్రెటరీ ఎస్ ఆర్ బాబు తెలియజేసారు.

## ఈదురు గాలుల బీభత్సం - విద్యుత్ కు అంతరాయం



గూడెం కొత్తవీధి/సీలేరు, మే 18, (ప్రభాతవార్త)



గూడెం కొత్తవీధి మండలం దారకొండ గ్రామంలో సోమవారం సాయంత్రం వేసిన బారి ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు పడిపోయి విద్యుత్ తీగలపై పడటం వలన విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి కొత్త స్థంబాల చేరిక వంటి మరమ్మతు పనులు ప్రారంభించారు. 33 కెవి లైన్ స్థంబాలు 2 పూర్తిగా విరిగిపోవడం. 4 చోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడం వలన విద్యుత్ సరఫరాకు కొంత ఆలస్యం అవుతుందని ప్రజలు సహకరించాలని విద్యుత్ సిబ్బంది తెలిపారు.

## తెలుగు దేశం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి..

### మండల మాజీ తెలుగు మహిళ అధ్యక్షురాలు ముక్కలి రాములమ్మ పిలుపు.



గూడెంకొత్తవీధి, మే 18, (ప్రభాతవార్త):

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని జీకేవీధి మండల టీడీపీ కార్యకర్తలకు మాజీ టిడిపి తెలుగు మహిళ అధ్యక్షురాలు ముక్కలి రాములమ్మ పిలుపునిచ్చారు.సోమవారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, జీకేవీధి మండలంలో పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు.పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యకర్తలను ప్రోత్సహించడం తమ బాధ్యత అని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని గుర్తించి తగిన గౌరవం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామాల్లో ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.టీడీపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి మరింత ఆదరణ పెంచాలని కోరారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

### పెట్రోల్, డీజీల్ ధరలు పెంపుకు నిరసన




అరకు రూరల్, మే 18, ప్రభాతవార్త:

పెట్రోల్, డీజిల్ పెంపుకు నిరసనగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ లో అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం, ఉమ్మడి విశాఖ జడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైసిపి శ్రేణులతో కలిసి శాంతి ర్యాలీ జరిపారు. అరకులోయ భారత పెట్రోల్ బంక్ నుండి ప్రధాన రహదారి మీదగా వైయస్సార్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ కొనసాగింది. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ పాలనను కొనసాగిస్తున్నాయని, దీనిలో భాగంగానే సామాన్య ప్రజల నడ్డి విరిచేలా పెట్రోల్ డీజిల్ ధరలను పెంచినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. లీటర్ పెట్రోల్ కేంద్రం మూడు రూపాయలు పెంచితే రాష్ట్రం ఐదు రూపాయలు పెంచిందని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్ యుద్ధ పరిస్థితులను సాకుగా చూపి ధరలను పెంచడం దుర్మార్గమన్నారు. అలాగే ప్రజలపై పన్నుల భారం మోపడం అన్యాయమని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలతో పాటు సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెబుతారని అన్నారు. వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సూచనలు మేరకు అరకులోయలో శాంతి ర్యాలీ నిర్వహించడం జరిగిందని చెప్పారు. కాగా శాంతి ర్యాలీ అనంతరం వైసీపీ నాయకులు శ్రేణులు అరకు రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించి, ధరలు తగ్గించకపోతే ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణిక్య, వైసిపి సీనియర్ నాయకుడు కమ్మిడి అశోక్, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, వైసీపీ నాయకులు చెట్టి అప్పాలు, స్వాభిరామ్మూర్తి, సూర్యనారాయణ, పరశురాం, అనిల్, పద్మారావు, విజయ్ కుమార్, ఈశ్వరమ్మ, మితుల, గుడివాడ ప్రకాష్, శుక్ర పాస్టర్, తదితరులు పాల్గొన్నారు.




### భరోసా పార్టీ అధ్యక్షుడు

## అభినయ్ దర్శన్‌పై దుండగుల దాడి



గూడెం కొత్తవీధి, మే 18, (ప్రభాతవార్త)

భరోసా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభినయ్ దర్శన్‌పై సోమవారం కొందరు గుర్తుతెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. స్థానికులు మరియు బాధితుల కథనం ప్రకారం.. అభినయ్ దర్శన్ తన అనుచరులతో కలిసి జీకే వీధి మండలం జర్రెల సమీపంలోనీ నీరుతోటమామిడి పాలెం గ్రామానికి వాహనంలో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కొందరు అపరిచిత వ్యక్తులు ఆయన ప్రయాణిస్తున్న కారును అడ్డగించి, మొదట వాహనాన్ని తీవ్రంగా ధ్వంసం చేశారు. అనంతరం అభినయ్ దర్శన్‌ను బలవంతంగా సమీపంలోని కాఫీ తోటల్లోకి లాక్కెళ్లి తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, ఆయనను చికిత్స నిమిత్తం సమీపంలోని జర్రెల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ దాడికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఘనంగా కొనసాగుతున్న అమ్మవారి జాతర మహోత్సవాలు



పాడేరు, మే 18, (ప్రభాతవార్త)

ఉత్తరాంధ్ర జిల్లాల దైవం, మన్య ప్రజల ఇలవేల్పు పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారు మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పాడేరు మెయిన్ రోడ్డు సతకం పట్టు వద్ద కొలువుతీరు ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తల్లి ఘటాన్ని పాదాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు అలాగే రెండవ రోజు పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెక్కరు. అమ్మవారి దర్శనానికి వందలాదిగా రావడంతో ఆలయం కిటకిటలాడుతుంది. జాతరలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## పాడేరు పురావీధులలో వైభవంగా అమ్మవారి ఘటాలు ఊరేగింపు

### - కళాబృందాలు, డప్పు వాయిద్యాల కోలాహలంతో పాడేరు పట్టణం

పాడేరు, మే 18, (ప్రభాతవార్త)



శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయం నుండి ఐటీడీఏ వరకు నిర్వహించిన అమ్మవారి ఘటాల ఊరేగింపు అత్యంత వైభవంగా, కన్నులపండువగా సాగింది. స్థానిక పురావీధుల గుండా సాగిన ఈ శోభాయాత్ర భక్తులలో ఆధ్యాత్మిక పండగ వాతావరణాన్ని నింపింది. ఈ ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సాంప్రదాయ కళాబృందాల నృత్యాలు, స్థానిక గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే ప్రదర్శనలు తిలకకర్తలను విశేషంగా ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాల హోరు, మేళతాళాల గింగురుల మధ్య భక్తులు అమ్మవారి ఘటాలకు ఘనంగా స్వాగతం పలికారు. దారిపొడవునా మహిళలు హారతులు పట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.?అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమైన ఈ భారీ ఊరేగింపు ముఖ్య కూడళ్ల గుండా సాగుతూ ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, పెద్ద సంఖ్యలో గిరిజన భక్తులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.



### ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవం సందర్భంగా..

## కలెక్టరేట్‌లో ప్రత్యేక వైద్య శిబిరం




పిఎం పాలెం, మే 18, ప్రభాతవార్త:

ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా జాయింట్ కలెక్టర్ జీ. విద్యాధరి సమక్షంలో, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మూడు వైద్య బృందాలు పాల్గొని కలెక్టరేట్ సిబ్బంది, పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి హాజరైన ప్రజలకు రక్తపోటు పరీక్షలు నిర్వహించాయి. ఈ సందర్భంగా వైద్య బృందాలు అధిక రక్తపోటు వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రమం తప్పకుండా బీపీ పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించాయి. ఉప్పు వినియోగాన్ని తగ్గించడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడిని నియంత్రించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం వంటి సూచనలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. డా. కె. అప్పారావు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త, డా. బి. హారిక, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్తతో పాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఆర్టీసీని ప్రైవేటుపరం చేయొద్దు

శ్రీకాకుళం, మే 18 ప్రభాతవార్త : విద్యుత్ బస్సుల నెపంతో ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ ఆపరేటర్లకు ఇచ్చి ఆర్టీసీని ప్రైవేటీకరణ చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఏపీ జేఏసీ అమరావతి శ్రీకాకుళం జిల్లా శాఖ చైర్మన్ బి.వి.వి.ఎన్. రాజు తెలియజేశారు. సోమవారం పీజీఆర్ కార్యక్రమంలో ప్రభుత్వానికి ఆర్టీసీ ఉద్యోగులు సమస్యలపై వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి శ్రీకాకుళం జిల్లా ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ కె.ప్రవల్లిక ప్రియ, ఏపీజేఏసి అమరావతి జనరల్ సెక్రెటరీ ఎస్.వి.రమణ, శ్రీకాకుళం జిల్లా ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.దశరథడు, జి.త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రధానం



శ్రీకాకుళం, మే 18 ప్రభాతవార్త : శ్రీకాకుళం ఆర్టీసీ ఆధ్వర్యంలో నడపబడుతున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 25వ బ్యాచ్ అభ్యర్థులకు సర్టిఫికెట్స్‌ను జిల్లా ప్రజా రవాణా అధికారి సి.హెచ్.అప్పలనారాయణ సోమవారం అందచేసి, అభినందనలు తెలిపారు. తదుపరి బ్యాచ్ నందు చేరుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి ధరఖాస్తులు కోరడమైనదిగా జిల్లా ప్రజా రవాణా అధికారి సి.హెచ్.అప్పలనారాయణ సోమవారం తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 సంవత్సరాలు నిండిన వారు ఈ హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్‌కు అర్హులు. మొత్తము శిక్షణ 40 రోజుల పాటు వుంటుంది. కావున ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని మనవి. ఫీజు, ఇతర వివరములకు 9390886033 ఫోన్ నంబర్‌ను సంప్ర దించగలరు. శ్రీకాకుళం 1వ డిపో మేనేజర్ అమరసింహుడు, శిక్షకుడు వి ఏ వి రావు పాల్గొన్నారు.

## గొదలాంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



సంతబొమ్మాళి, మే 18 ప్రభాతవార్త మండలంలోని గొదలాం గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఉమా పాలేశ్వర స్వామి మూడవ కళ్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఎంతోఉల్లాసంగా ఉత్సాహంగా ప్రారంభమ య్యాయి. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో జిల్లా నలుమూ లల నుంచి 40టీమ్‌లు తమ పేర్లు నమోదు చేసుకున్నాయి. మొదట రోజు సీతానగరం సున్నాపల్లి జట్ల మధ్య రసవత్తరంగా పోటీ జరిగింది. ఈ పోటీలలో సీతానగరం జట్టు విజయం సాధించింది. ఈ టీమ్‌లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా బాలు బహుమతి అందుకున్నారు. ఈ టోర్నమెంట్ శివాలయం యూత్, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

## 20న మందుల షాపుల బంద్‌కు పిలుపు



సంతకవిటి, మే 18 ప్రభాతవార్త : ఈ నెల 20వ తేదీన అఖిలభారత కెమిస్ట్ సంఘం సమాఖ్య ఆల్ ఇండియా పిలుపు మేరకు సంతకవిటిలో మెడికల్ షాపులను బంద్ జరుపుతున్నట్లు విజయనగరం జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అక్కరబోతు సత్యనారాయణ సోమవారం విలేకరులకు తెలిపారు. ప్రెస్క్రిప్షన్ వెరిఫికేషన్ చూడకుండా ఆన్లైన్లో మందులు అమ్మడానికి భారీ డిస్కౌంట్ లిస్టు మెడికల్ తీవ్ర నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో బందుకు పిలుపునిచ్చినట్టు ఆయన వివరించారు. అవసరమైన వారు ముందుగానే అవసరమైన మందులను కొనుక్కొని జాగ్రత్త పడాలని సత్యనారాయణ సూచించారు.



## పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి

ఇచ్ఛాపురం, మే 18 ప్రభాతవార్త : పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైస్సార్సీపీ శ్రేణులు ఇచ్ఛాపురం బస్టాండ్ నుండి ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ వెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, సోంపేట ఎంపీపీ నిమ్మన దాసు, సోంపేట జడ్పీటీసీ యశోదమ్మ, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, ప్రత్తి అన్వేష్, ఆశి పురుషోత్తం, చిట్టి బాబు, ప్రకాశరావు పట్నాయక్, ఆశి కృష్ణారెడ్డి, ఆశి పురుషోత్తం, నర్తు ప్రేమ్ కుమార్, తడక జోగారావు, పిలక విజయ్, నీలాపు ఢిల్లీ, సాలిన గాంధీ, చల్ల దేవరాజు, పిలక దేవరాజు, కాళ్ళ మదన్, బొండాడ మహేష్, నీలయ్య, వల్లభరావు, బచ్చు జగన్, బాకీ లక్ష్మీనారాయణ, దక్కత నూకయ్య, కారంగి త్రినాథ్, వలసయ్య, దుక్క ధనలక్ష్మి, ప్రవీణ్, శ్రీరామ్, సాడి జయరాం తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలలో జ్ఞానభారతి ప్రతిభ



ఇచ్ఛాపురం, మే 18 ప్రభాతవార్త ఇటీవలే విడుదలైన సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాలలో జ్ఞానభారతి పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయిలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించిన పరీక్షల ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించారు. విద్యార్థిని ఉమ్మి హబీబా అక్తారి 500 మార్కులకు గాను 387 మార్కులతో 77.4% సాధించి మొదటి స్థానంలో నిలిచింది. అత్యధికంగా ఇంగ్లీషు సబ్జెక్టులో 89 మార్కులు సాధించింది. 363 మార్కులతో 72.6% సాధించిన అనసూరి సంతోష్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ విద్యార్థి అత్యధికంగా ఇంగ్లీషులో 95 మార్కులు సాధిం చారు. 344 మార్కులతో అనామిక కుమారి తృతీయ స్థానంలో నిలిచింది. అత్యధిక మార్కులు సాధిం చిన విద్యార్థులకు, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పాఠశాల కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణ అధికారి జోహార్ ఖాన్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, ప్రధానో పాధ్యాయురాలు సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ అభినందించారు.

## వీరఘట్టం క్రికెట్ టీంపై శ్రీకాకుళం సిక్కోలు చీటాస్ విజయం



ఆముదలవలస, మే 18 (ప్రభాతవార్త) వీరఘట్టం క్రికెట్ టీంపై శ్రీకాకుళం సిక్కోలు సిటాస్ విజయం సాధించింది. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న చిరంజీవి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సెమీఫైనల్ క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా జరిగింది. వీరఘట్టం క్రికెట్ టీం పై శ్రీకాకుళం సిక్కోలు చిటాస్ 3పరుగులు తేడాతో విజయం సాధించింది. వీరఘట్టం క్రికెట్ టీం టాస్ గెలిచి బౌలింగ్ చేయడంతో శ్రీకాకుళం చిక్కోలు చీటాస్ 20 ఓవర్లుకు 182 పరుగులు చేసి 9 వికెట్లు కోల్పోయింది. తర్వాత వచ్చిన వీరఘట్టం క్లబ్ సభ్యులు 20 ఓవర్లుకు 178 పరుగులు చేయడంతో చిక్కోలు చీటాస్ టీం విజయం సాధించారు. దీంతో చిక్కోలు చీటాస్ టీం గెలిచినట్లు క్రికెట్ నిర్వాహణ కమిటీ సభ్యులు ప్రకటించారు. అంపైర్లుగా కిల్లి సుదర్శనరావు, స్కోరర్‌గా ఈశ్వరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తమ్మినేని విద్యాసాగర్, చిరంజీవి మెమోరియల్ క్రికెట్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. బుధవారం సోంపేట, శ్రీకాకుళం జడ్సిసి జట్ల మధ్య క్రికెట్ పోటీ జరుగుతుందని నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్ ప్రకటించారు.

## బాలింత మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

సీతంపేట, మే 18 ప్రభాతవార్త పాలకొండలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన గిరిజన బాలింత నిమ్మక మాధురి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసారు. శ్రీకాకుళం రాగోలు ఆసుపత్రిలో చికిత్సకు ముందు పాలకొండ ఆసుపత్రిలో మాధురి చికిత్స పొందారని రంజిత్ కుమార్ వివరించారు. గతంలో కూడా ఇదే ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన పలువురు మృతి చెందినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయని రంజిత్ కుమార్ వివరించారు మాధురి మృతిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## స్వచ్ఛ పాతపట్నమే తమ లక్ష్యం



పాతపట్నం, మే 18 ప్రభాతవార్త : పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసే ఆధునిక మిషనరీని సోమవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మిషనరీ పనితీరును ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గాన్ని పచ్చదనం పరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చడమే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు. పర్యావరణానికి ఎంతో ముప్పుగా మారిన ప్లాస్టిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించేందుకు ఆధునిక మిషనరీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ యంత్రం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను సులభంగా వేరు చేసి, రీసైక్లింగ్‌కు పంపడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరడమే కాకుండా, గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిపై అధికారులను నిలదీసిన ఎంపీపీ

-మండల సమావేశంలో ఏఈ పై ప్రశ్నలు వర్షం



సంతబొమ్మాళి, మే 18 ప్రభాతవార్త : ఉమిలాడ గ్రామంలో రక్షిత మంచినీటి పైప్ లైన్ పాడైందని నాలుగు నెలల క్రితం నుంచి చెబుతున్నాం. ఇంతవరకు మీరు ఏమి చేసారు? ఆ సమస్య నెరవేరలేదని ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అప్పారావు ఆర్డబ్ల్యుఎస్ ఏఈ మహేష్‌ను నిలదీశారు.



స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశమందిరంలో ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అప్పారావు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా ఆర్డబ్ల్యుఎస్ శాఖపై చర్చ జరుగుతుండగా ఉమిలాడ సంగం వీధిలో రోడ్డు పనులు సమయంలో సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రక్షిత మంచినీటి పథకం పైపులైను పాడై తాగునీరు కొళాయిలకు సరఫరా కాక వృధాగా పోతుందని ఈ సమస్య గత సమావేశం ముందు మీ దృష్టికి తీసుకువచ్చిన ఇప్పటికి ఆ సమస్యకు పరిష్కారం చూపలేదని ఇది మీ పనితీరుకు నిదర్శనంగా కనిపిస్తుందని ఎంపీపీ ప్రశ్నిచారు. పైప్ లైన్ మరమ్మతు కోసం మండల పరిషత్ నిధులు ఇస్తామన్నా మీరు ఎందుకు తస్కారం చేస్తున్నారని నిలదీశారు. ప్రస్తుతం నీటి ఎద్దడి ఎక్కువగా గ్రామంలో ఉందని ఎప్పటికైనా మీరు ఆ సమస్యలను పరిష్కారం చూపకపోతే ఖాళీ బిందెలతో జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేసేందుకు సిద్దంగా ఉన్నారని ఎంపీపీ హెచ్చరించారు. ఈ సమావేశంలో వచ్చిన సమస్యలు వచ్చే సమస్య సమావేశంలోపల పరిష్కారం చూపకపోతే ఇలాంటి సమావేశంలో జరుపుకోవడం ఎందుకు దండగ అని మేఘవరం ఎంపీటీసీ సభ్యులు సూరాడ రాజారావు అన్నారు. ప్రస్తుతం తీరప్రాంత గ్రామాలలో నీటి ఏద్దడి ఎక్కువగా ఉందని మురువాడ, గద్దలపాడులలో గ్రామ దేవత పండుగలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా తాగునీరు ట్యాంకర్‌లతో సరఫరా చేయాలని ఏఈ కోరారు. నౌపడ పంచాయతీ సీతానగరం గ్రామంలో కొన్నేళ్లుగా నీరు సరఫరా కావడం లేదు. ఈ విషయం పలుమార్లు మీ అధికారులు దృష్టిలో పెట్టిన ఫలితం లేకపోయింది. కనీసం హ్యాండ్ బోరు వేసయినా నీటి ఏద్దడి లేకుండా చూడాలని ఎంపీటీసీ బత్సల సుధా సమావేశంలో కోరారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం మీరు ఏమైనా ప్రణాళికలు చేశారా అంటూ చింతాడ చిన్నారావు ఏఈ ని ప్రశ్నిచారు. అనంతరం రెండేళ్ల నుంచి అందని గౌరవ వేతనంపై ఎంపీడీఓ జయంతి ప్రసాద్‌ను సభ్యులు ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీఓ ఇటీవల జడ్పీ నుంచి వివరాలు అడిగారని పంపించాము త్వరలో నిధులు విడుదలవుతాయని ఆయన తెలిపారు. దీనిపై జడ్పిటిసి పాలవసంత రెడ్డి ఇటీవల జడ్పీ సమావేశంలో దీనిపై చర్చ జరిగిందని సత్వరమే సభ్యుల గౌరవ వేతనం విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. మీరు మరొకసారి జెడ్పీలో మాట్లాడాలని ఎంపీడీవోకు ఆయన సూచించారు.అనంతరం విద్యుత్, రెవిన్యూ, వైద్య ఆరోగ్య, వెటర్నరీ, మత్యాశాఖలపై సాధారణ చర్చ జరిగింది. ఈ సమావేశం ఉదయం 10గంటలకు జరగాల్సి ఉండగా కోరం సభ్యులు హాజరు లేక గంట ఆలస్యం జరిగింది. ఈ సమావేశానికి ఆర్ అండ్ బి, నీటిపారుదల శాఖ అధికారులు దుమ్మా కొట్టారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పాల వసంత రెడ్డి. ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ ఎం ఈఓ అర్జునుడు, అధికారులు సభ్యులు పాల్గొన్నారు.

## జనగణన వేగవంతం చేయాలి



ఇచ్ఛాపురం, మే 18 ప్రభాతవార్త : మండలంలో జనగణన వేగవంతం చేయాలని తహసీల్దార్ వెంకటరావు ఆదేశించారు. ఎంపిడిఓ ప్రభాకరరావుతో కలిసి ఈదుపురం, తులసిగాం ధర్మాపురం గ్రామాలను సందర్శించి తక్కువ ప్రగతి ఉన్న ఎన్యుమరేటర్‌లను సర్వే వేగవంతం చెయ్యమని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు ప్రకారం ఈ నెల 20 లోగా పూర్తి చెయ్యమని ఆదేశించారు. నేటి వరకు 70శాతం మాత్రమే పూర్తయ్యిందని మిగిలిన 30 శాతం కూడా ఈ రెండు రోజుల్లో తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవరు కూడా అలసత్వం వహించారాదని హెచ్చరికలు జారి చేశారు.

## బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన



ఆమదాలవలస, మే 18, (ప్రభాతవార్త) నియోజకవర్గంలో పొందూరు మండలం తండ్యం గ్రామానికి చెందిన బాధ లోకేష్ కుటుంబానికి ఒక లక్ష 55 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే కూన రవికుమార్ తన నివాసంలో పంపిణీ చేశారు. వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి అందించాలని పలువురు ఎమ్మెల్యే రవికుమార్‌కు విన్నవించుకున్నారు. వారి విన్నపాన్ని ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కార్యాలయానికి అందించారు. ఈ దరఖాస్తులు పరిశీలించిన ముఖ్యమంత్రి కార్యాలయం సహాయనిధి మంజూరు చేశారు. సీఎం సహాయనిధి చెక్కులను వైద్య చికిత్స నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అన్నారు. సీఎంఆర్ఎఫ్ సహాయం అందడంతో లోకేష్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రవికుమార్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల వాటాకు త్వరలో నిధులు : ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస, మే 18 ప్రభాతవార్త పలాస నియోజకవర్గ పరిధిలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు వారి వాటా మొత్తాన్ని త్వరలోనే అందిస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వడం కంటే రంగులు వేయడానికే ప్రాధాన్యత ఇచ్చింది. పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే ఆలోచన వారికి లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసి, లబ్ధిదారులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందవద్దు. మీ అమౌంట్ త్వరలోనే మీ చేతికి అందుతుంది" అని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసిందని, బకాయిలు క్లియర్ చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. పేదల సంక్షేమమే తమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో కవిటి వాసి మృతి



కంచిలి, మే 18 ప్రభాతవార్త : మండల పరిధిలోని ఆదివారం సంత జాతీయ రహదారి వద్ద సోమవారం మధ్యా హ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం పాత శిలగాం గ్రామానికి చెందిన పోకల రాము (55) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు, కంచిలి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన మనవరాలి వైద్య పరీక్షల కోసం ద్విచక్ర వాహనంపై సోంపేట వెళ్లిన రాము, తిరిగి స్వగ్రామం వెళ్లే క్రమంలో మకరాంపురం జంక్షన్ వద్ద ఆగాడు. అక్కడ మంచినీళ్లు తాగిన అనంతరం, మకరాంపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న జార్ఖండ్‌కి చెందిన కారు వేగంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో రాముకి చెందిన ద్విచక్ర వాహనం కారు మధ్యలో ఇరుక్కొని సుమారు 500 మీటర్ల వరకు ఈడ్చుకు వెళ్ళి పోయింది. దీంతో రాము తలకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య రాజేశ్వరితో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జరిగిన సంఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పారినాయుడు తెలిపారు.

## శ్రీనీలమణి దుర్గా అమ్మవారి హుండీ ఆదాయం రూ.7.98 లక్షలు



పాతపట్నం, మే 18 ప్రభాతవార్త : పాతపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి దేవస్థానంలోని హుండీలను సోమవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. గత 53 రోజులకు గాను అమ్మవారికి 7,98,629 రూపాయలు ఆదాయం లభించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మందస గ్రూపు దేవాలయాల కార్య నిర్వహణాధికారి ఎస్.నాగేశ్వరరావు, నీలమణి దుర్గా ఆలయ కార్యనిర్వహణాధికారి టి.వాసుదేవరావు ఈ లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు ధర్మకర్తల మండలి చైర్మన్ అక్కంధ్ర సన్యాసిరావు, కమిటీ సభ్యులు ఉమా శంకర్ మిశ్రో, కె రమాదేవి, ధర్మకర్త ప్రతినిధి ఎస్.బుల్లిబాబు, దాసరి వెంకటరమణ, బి.గోపాలరావు, భక్తులు, శ్రీ వేంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త



## ప్రత్యేక కిట్టుతో... గంజాయి మత్తుకి చెక్



వీరఘట్టం, మే 17 ప్రభాతవార్త : జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక కిట్టుతో గంజాయి మత్తుకు చెక్ పెడుతున్నారు వీరఘట్టం పోలీసులు. ఇందులో భాగంగా సోమవారం పలు తనిఖీలను ఎస్సై ఎస్.షణ్ముఖరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల గంజాయి వినియోగిస్తున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో వారిని నియంత్రించాలనే ఉద్దేశంతో ఒక ప్రత్యేక తనిఖీని చేపట్టారు. గంజాయి తాగుతున్న వారిని గుర్తించడం కోసం టి.హెచ్.సి.కిట్‌ను ఉపయోగించి, వారు గంజాయి సేవించారా లేదా అనే విషయాన్ని ఈ కిట్టు ద్వారా నిర్ధారించవచ్చు. ఇందులో భాగంగా సోమవారం కొంతమంది అనుమానిత వ్యక్తులను ఈ కిట్ సహాయంతో ఎస్సై బృందం పరీక్షించారు. ఈ సందర్భంగా యువత గంజాయికి బానిసలై తప్పుడు మార్గాల్లో వెళ్తూ తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, యువత అంతా గంజాయి మరియు ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరుతూ ప్రతి గ్రామంలోనూ అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఎవరైనా యువకులు గంజాయికి అలవాటు పడినట్లు గమనిస్తే, వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని ఎస్సై షణ్ముఖరావు కోరారు.

## 21న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సీతంపేట, మే 18 ప్రభాతవార్త పాలకొండ డివిజన్ పరిధిలోని సీతంపేట ఎలక్ట్రికల్ సెక్షన్ కార్యాలయంలో మే 21న ఉదయం 10 గంటల నుండి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వేదికను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ పార్వతీపురం మన్యం జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ కె.మల్లిఖార్జునరావు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. పరిష్కరించే విద్యుత్ సమస్యలు తప్పుగా బిల్లింగ్ చేయడం బిల్లుల్లో తప్పులు, కాలిపోయిన విద్యుత్ మీటర్ల మార్పిడి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, లోవోల్టేజ్ హైవోల్టేజ్ సమస్యలు, సర్వీసుల్లో లోపాలు, ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలు చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు సమస్యలపై ప్రత్యేక వేదికలో ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. వీటితోపాటు ఇతర ఏవైనా విద్యుత్ సంబంధిత ఇబ్బందులు ఉంటే, వాటిని ఈ వినియోగదారుల పరిష్కార వేదిక దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కరించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి



పాతపట్నం, మే 18 ప్రభాతవార్త : పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్3 (మార్కెట్ యార్డ్ వెనుక భాగంలో) ఉన్న హుడా సుడా (జగనన్న కాలనీ) నివాసితులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పాతపట్నం మండల వైకాపా అధ్యక్షులు, వైస్ ఎంపిపి సవిరిగాన ప్రదీప్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల క్రితం ఈ కాలనీ మంజూరైనప్పటికీ, నేటికీ అక్కడ సరైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ మరియు ఇతర మౌలిక వసతులు లేవని పేర్కొన్నారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ విన్నపాన్ని సానుకూలంగా పరిశీలించాలని ఆయన కోరారు. సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, త్వరితగతిన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ప్రదీప్ విజ్ఞప్తి చేశారు. విన్నపంతో పాటు కాలనీలోని ప్రస్తుత పరిస్థితిని వివరించే ఫోటోలను కూడా జతచేసి వినతిపత్రాన్ని సమర్పించారు.

## సామాజిక అంశాలపై అవగాహన కల్పించిన పోలీస్



వీరఘట్టం, మే 17 ప్రభాతవార్త సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే ధ్యేయంగా పోలీస్ శాఖ కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని బొడ్లపాడు గ్రామంలో ఎస్ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు అందరూ తప్పనిసరిగా రహదారి నిబంధనలను పాటించి తీరాలన్నారు. మితిమీరిన వేగం, అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదాల గురించి ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది ప్రాణ రక్షణ కవచమని ఎస్సై ప్రజలకు వివరించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల గురించి అవగాహనతోపాటు, అపరిచిత వ్యక్తులకు ఓటిపి లు చెప్పకూడదని, నకిలీ లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వారికి తెలియజేసారు. యువత వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని, గ్రామంలో ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా లేదా వాడినా వెంటనే సమాచారం అందించాలని ఎస్ఎస్ షణ్ముఖరావు కోరారు.

## గ్రంథాలయంలో ఉత్సాహంగా వేసవి శిక్షణ



పాతపట్నం, మే 18 ప్రభాతవార్త : స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం సోమవారం అత్యంత ఉత్సాహంగా కొనసాగింది. గ్రంథాలయ అధికారిణి డి.సాయమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈరోజు శిక్షణలో భాగంగా విద్యార్థులతో అల్లావుద్దీన్ అద్భుత దీపం, ఆలీబాబా 40 దొంగలు వంటి సాహస గాథలతో పాటు, జీవన విలువలను నేర్పే పంచతంత్ర కథలను చదివించారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులలో ఊహాశక్తిని, నైతిక విలువలను పెంపొందించవచ్చని ఈ సందర్భంగా సాయమ్మ పేర్కొన్నారు. చదువుతో పాటు శారీరక ఉల్లాసం కోసం విద్యార్థులచే కోలాటం ఆడించారు. మన సాంప్రదాయ కళలను ప్రతిబింబించేలా విద్యార్థులు లయబద్ధంగా చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. వేసవి సెలవులను ఇలా జ్ఞానంతో పాటు వినోదంతో గడపడం పట్ల విద్యార్థులు మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రకృతి సిద్ధమైన కూరగాయల్ని వినియోగించండి



కోటబొమ్మాళి, మే 18 ప్రభాతవార్త : అంతు చిక్కని వ్యాధులు ప్రబలుతున్న ఈ రోజుల్లో రసాయనిక ఎరువులతో పండించిన పంటలు విడనాడి ప్రకృతి సిద్ధంగా పండే పంటలను వినియోగించాలని ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్ వంక సింహాచలం అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను స్టాల్ పెట్టి వినియోగదారులకు అమ్మకాలు నిర్వహించారు. ఈ స్టాల్ నందు విక్రయించే కాయగూరలు ఆకుకూరలు గోఆదారిత ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించినటువంటివి, ఆరోగ్యాభిలాషులందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. రానున్న రోజుల్లో వ్యతిరేకి రసాయనిక ఎరువులు విడనాడి గోదారిత వ్యవసాయాన్ని చేయడం ద్వారా ప్రజా ఆరోగ్యాన్ని సారక్షించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైసీపీ భారీ నిరసన



పలాస, మే 18 ప్రభాతవార్త : పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పలాసలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది.కాశీబుగ్గలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు పాల్గొన్నారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల కారణంగా పెట్రోల్, డీజిల్ ధరలు నిరంతరం పెరుగుతున్నాయని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డా.సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ, పెరిగిన ఇంధన ధరలతో సామాన్యులు, రైతులు, కార్మికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజలపై అదనపు భారం మోపే విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## సమాజంపట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

రామభద్రపురం, మే 18 ప్రభాతవార్త

సమాజంపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ పి.కృష్ణకుమారి సూచించారు. మండల కేంద్రంలో శనివారం కిశోర వికాశం కార్యక్రమంలో భాగంగా పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు పిల్లలు తల్లిదండ్రులకుగానీ, స్నేహితులతోగాని తెలిపి ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు ఆటలనందు శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలి నిర్వహించారు.

## నియోజకవర్గ స్థాయి కమిటీలు వివరాలు సేకరణ

బొబ్బిలి మే 18 ప్రభాతవార్త



రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు సేవ రక్షక దళ్. నిర్వాహక దళ్. పరిపాలకు దళ్‌లతో పార్టీని సమర్థవంతంగా నిర్వహించేందుకు వీరిని నియమిస్తామని బొబ్బిలి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గిరడ అప్పలస్వామి వెల్లడించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో సమావేశం మాట్లాడుతూ కార్యకర్తలు నుంచి నాయకులు వరకు కొత్త క్యాడర్ ఇంటికి చేస్తామని అన్నారు. అన్ని విభాగాల క్యాడర్లను నియోజకవర్గానికి వేస్తామని వాటి ద్వారా సుపరిపాలన అందించడమే లక్ష్యంగా సంసిద్ధులు చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ బలమైన శక్తిగా మారుతుందని అన్నారు. ప్రధాని మోదీ చెప్పిన పొదుపును పాటిస్తామని అన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాల మీద ముందుకు కదిలే పార్టీని అన్నారు. డొక్కా సీతమ్మ సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వీర మహిళలు. రేవల్ల కిరణ్ పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని ధర్నా



బొబ్బిలి. మే 18 ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని వైయస్సార్సీపి రాష్ట్ర నాయకత్వ ఇచ్చిన పిలుపుమేరకు బొబ్బిలి నియోజకవర్గం ఇన్చార్జ్ ఎస్ వెంకట చినప్పలనాయుడు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేసి తహసిల్దార్ కువినతి పత్రం అందజేశారు. సోమవారం పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి నియోజకవర్గస్థాయి నాయకులు అంత ధర్నా చేస్తూ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేయడానికి వెళ్లారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటే సామాన్యుడు సాధారణంగా బతికేందుకు కావలసిన వంటగ్యాసు పెట్రోలు డీజిల్ ధరలు పెంచినవి తగ్గించాలని తగ్గించకపోతే భారీ మూల్యం చెల్లించవలసి వస్తుందని హెచ్చరించారు. తాసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శిఎస్ వేణుగోపాల్ నాయుడు. మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు. వెంకట మురళీకృష్ణ. అన్నిరెడ్డి దామోదర్ రావు చోడిగంజి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

## బంగారం చోరీకి యత్నం

మక్కువ మే 18 ప్రభాతవార్త



మండలంలోని దబ్బ గడ్డ గ్రామంలో సోమవారం ఉదయం బంగారం మెరుగు పెడతానంటూ ఇద్దరు యువకులు గ్రామంలో తిరిగారని మొదట వెండి పట్టీలు ఇవ్వగా మెరుగుపట్టారని, తరువాత బంగారం మెరుగుపట్ట దానికి ఇవ్వగా ద్రావకంలో ముంచగా బంగారం ముక్క ముక్కలు అవ్వడాన్ని గమనించిన స్థానికులు ఫోటో తీస్తానని అనగా ఆ ఇద్దరు పరారయ్యారు. ఆ ఇద్దరు వ్యక్తులు తమ బ్యాగులను అక్కడే వదిలి పరారయ్యారు ఆ బ్యాగులలో మత్తుమందు లు ఉన్నాయన్న అనుమానం గ్రామస్తులు వ్యక్తపరుస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.

## స్పెషల్ డ్రైవ్‌లో డ్రగ్ టెస్టింగ్ కిట్‌తో తనిఖీలు : టౌన్ సీఐ

సాలూరు మే18 ప్రభాతవార్త



పట్టణంలో గంజాయి నిర్మూలనలో టౌన్ పోలీస్ వారు స్పెషల్ డ్రైవ్ నిర్వ హించి డ్రగ్ టెస్టింగ్ కిట్లతో తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోమ వారం టౌన్ సీఐ అప్పల నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది గవర్న మెంట్ హాస్పిటల్ సమీపంలో ఉన్న నిర్జీవ ప్రదేశాలలో గంజాయి సేవించారేమో అని గుర్తించడానికి అనుమానస్పద వ్యక్తులను డ్రగ్ టెస్టింగ్ కిట్‌తో తనిఖీలు చేపట్టారు.దీని ముఖ్య ఉద్దేశం గంజాయి రహిత పట్టణాన్ని చేయడమని ఇంకా మాదక ద్రవ్యాల భారిన పడకుండా కాపాడడం సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించడం అంతేకాకుండా గంజాయి రవాణా విక్రయాలు సేవించడం చట్టపరంగా నేరమని దీని సమాచారం ఎవరికైనా తెలిస్తే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు ఎస్.ఐ. అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదరికంతో కుటుంబ పెద్ద కేన్సర్‌తో మరణం

### స్పందించిన దాతలు 173 వేలు వితరణ

లక్కవరపు కోట, మే 18 ప్రభాతవార్త



మండలంలోని కిత్తన్న పేట పంచాయతీ శివారు రేవల్ల పాలెం గ్రామంకి చెందిన పోలమర శెట్టి నాయుడు నోటి కెన్సర్ సోకి చికిత్స చేసుకునే స్తోమత లేక ఛిన్న వయసులోనే మరణించడంతో ఇద్దరు ఛిన్న పిల్లలు ఆమె భార్య ఉండేందు గుడిసె కూడా లేక పాడు బడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలో దిక్కు తోచని స్థితిలో వున్నారు అనే సమాచారంను గ్రామంకి చెందిన యువకుడు పోలమర శెట్టి వెంకటేశ్ వీడియో రూపంలో బయటకు తీసుకుని రాగా స్పందించిన పలు సేవా సంఘాలు పలువురు దాతలు తమకు తోచిన సహాయం చేయగా అది మొత్తం 173000 వరకు రావడం జరిగింది ఆ మొత్తంని మృతుడు పెద్ద ఖర్మ సోమవారం గ్రామంలో నిర్వహించిన సందర్భంగా జాకేరు మాజీ సర్పంచ్ బుద్ధా అప్పారావు ఇతర దాతలు యువత ఆధ్వర్యంలో మృతుని భార్యకి అందజేశారు. ఈ విదంగా మానవత్వాన్ని చాటి ఆర్థిక సహాయం అందించిన ఒక కుటుం బంకి బ్రతకడానికి ఆసరాగా నిలిచిన ప్రతి ఒక్కరికి గ్రామస్థులు మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉండేందుకు ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న వీరికి ప్రభుత్వం సహాయం అందించాలని అని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే నాగ మాధవి చేతుల మీదుగా సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

నెల్లిమర్ల, మే 18, ప్రభాతవార్త



పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. నెల్లిమర్లకు చెందిన సూరా బత్తుల చిట్టిబాబుకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.70 వేల రూపాయిల ఆర్థిక సహాయం చెక్కును ఎమ్మెల్యే నాగ మాధవి నెల్లిమర్ల పట్టణానికి చెందిన సదరు లబ్ధిదారుడు చిట్టిబాబుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ చేయమని, అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సాయాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని, మెరుగైన ఆరోగ్యం పొందాలని ఆమె ఆకాంక్షించారు. నెల్లిమర్ల జనసేన నాయకుడు గంటా సతీష్ పాల్గొన్నారు.

## డీవీఎల్ స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ.. పది మంది నవోదయకు ఎంపిక..

శృంగవరపుకోట,మే17,ప్రభాతవార్త

మండలంలోని భవానీ నగర్ లోఉన్న డాక్టర్ వరలక్ష్మీ పబ్లిక్ స్కూల్(డీవీఎల్)విద్యార్థులు అద్భుతమైన మంచి సత్తా చాటారు.2026-27 విద్యా సంవత్సరానికి సంభందించి జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన 11వ తరగతి ప్రవేశ పరీక్షల్లో డీవీఎల్ స్కూల్ కు చెందిన పది మంది పదో తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. ఎస్.శ్రావణశరణ్య,డి.కోటి జోత్స్న, వి.వందన శ్రీఅక్షయ, ఎం.సౌమ్యశ్రీ అక్షర భాను, ఎస్.మోహన్, ఎ.హర్షవర్ధన్, ఎం.గుణశేఖర్,ఎన్.భార్గవ్ కౌశిక్,కె.సాయి సురేంద్ర వర్మ,పి.జశ్వంత్ ఎంపికయ్యారని స్కూల్ ప్రిన్సిపాల్ వై.జానకీ దేవి తెలిపారు.విద్యార్థులను స్కూల్ అధినేత డాక్టర్ పి.వరలక్ష్మీ, డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి

నెల్లిమర్ల, మే 18, ప్రభాతవార్త



మండలంలోని గుసిని పంచాయతీ పరిధిలోని చనమల్లు పేట గ్రామ సమీపంలో ఈనెల 16వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ నుంచి పడి తీవ్ర గాయాల పాలై ఆసు పత్రిలో చేరిన గుసుని గ్రామానికి చెందిన చందక తేజ నాయుడు (16) చికిత్స పొందుతూ శ్రీకాకుళం జేమ్స్ ఆసుపత్రిలో సోమవారం మృతి చెందినట్లు ఎస్పై బి గణేష్ తెలిపారు. ఈనెల 16వ తేదీన గుషిని గ్రామ సచివాలయం ఉద్యోగి రహీం ద్విచక్ర వాహనంపై తేజ నాయుడు వెనుక కూర్చొని ప్రయాణిస్తున్న సమయంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగినట్లు ఎస్ఐ తెలిపారు. తేజ నాయుడుకు తొలుత విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స జరిగిందని, అనంతరం మెరుగైన వైద్యం కోసం జెమ్స్ ఆసుపత్రికి తరలించారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కడప జిల్లాలో జరజాపుపేట యువతి మృతి

నెల్లిమర్ల, మే 18, ప్రభాతవార్త

కడప జిల్లా చక్రాయిపేట మండలం కొండప్ప పల్లి సమీపంలో నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన కే. దీపిక అనే యువతి మరణించి ఉన్నట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. వెంటనే ఇక్కడికి సమాచారం అందడంతో కుటుంబీకులు బయలుదేరి వెళ్లారు. దీపిక విద్యాభ్యాసం కోసం గత కొంతకాలంగా కడప జిల్లాలో ఉంటున్నట్లు తెలిసింది. దీపిక మరణానికి కారణాలు ఇంకా స్పష్టం కాలేదు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జరజాపు పేటలో మృతురాలి కుటుంబీకుల్లో విషాదం నెలకొంది.

## పెట్రో డిజల్ ధరలపై భగ్గుమన్న వైసీపీ ర్యాలీ నిరసన

### ఆటోను తాడుతో లాగిన మాజీ డిసీఎం రాజన్నదొర



సాలూరు మే18 ప్రభాతవార్త

భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా పెట్రోల్ డీజిల్ ధరలే కాకుండా గ్యాస్, కరెంటు చార్జీలు పెంచడం సీఎం చంద్ర బాబు చేతకాని పాలనకు అద్దం పడుతుం దని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం రాజన్నదొర ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులతో బారీర్యాలీ నిర్వహించారు. అలాగే పార్టీ నాయకులు కార్యకర్తలు బాబుపాలనలో బాదుడే బాదుడు అంటూ నిరసన గళం విప్పి నినాదాలు చేసారు.అంతేకాకుండా ఆటోకు తాళ్లుకట్టి మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర భుజంతో లాగి పెట్రో డీజల్ ధరలు పెంచడం ప్రజలకు పెనుబారమని ఆవేదన వ్యక్తం చేసారు. తాహిసిల్దార్ కార్యలయనకి వెళ్లి ధరలు తగ్గించాలని ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతు దేశ రాజధానిలో పెట్రోల్ ధర 97 రూపాయలని కాని ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్ ధర మాత్రం 113 రూ. 62 పైసలని ఇదెక్కడ అన్యాయ మని ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వం భరించాల్సిన వ్యాట్ ను ప్రజలపై వేయడం దారుణమని కూటమి ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. టౌన్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, రంగునాయుడు,దండి శ్రీను,డోల బాబ్జి,కొల్లి. వెంకటరమణ,మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

డెంకాడ. మే18 ప్రభాతవార్త



గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. పూసపాటిరేగ మండలంలోని చౌడువాడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు బావిని,వెల్దురు పంచాయతీ కాళ్లపరెడ్డి గ్రామంలో జలజీవన్ మిషన్ తాగునీటి పైపులైను, కోనాడ పంచాయతీ పరిధిలోని బిజె గ్రామంలో తాగునీటి ప్రాజెక్టును సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అద్భుతమైన దూర దృష్టి, పల్లెల పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమ, ప్రజల సమస్యలపై ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ వల్లే నేడు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నెలిమర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ డి.పైడిరాజు, అప్పలసూరి, గుడివాడ జమ్మిరాజు, సత్యవతి, నాయన శ్రీను, వి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల లేక ఇబ్బంది పడుతున్న ఆర్టీసీ ప్రయాణికులు



బలిజిపేట, మే 18, ప్రభాతవార్త

మండల కేంద్రంలో గల ఆర్టీసీ బస్సు స్టాండ్ కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న వైనం బాధలు తప్ప లేదంటూ హామీలు అంటూ ముం దుకు వస్తారు తేరా గెలిచాక కనీసం పరిసరాలను పట్టించుకోలేని నాయకులు అధికారులు గత మెజిస్ట్రేట్ జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు దీని మౌలిక సదు పాయాలు కరువయ్యావని స్థానిక ఆర్టీసీ ప్రయాణికులు తెలిపారు కాగా ఆర్టీసీలో ప్రతిరోజు వందల సంఖ్యలో ప్రయాణాలు జరుగుతున్న బస్టాండ్ ఆవరణములో బాత్రూములు, త్రాగునీటి సమస్య విద్యుత్తు కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాన్ని వాపోతున్నారు. పాలకుల మారారు. అయ్యా ఇకనైనా కలెక్టర్ వారు స్పందించి వెంటనే ఈ ఆర్టీసీ ఆవరణంలో ఉన్న మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రయాణికులు కోరుచున్నారు.

## బాల్య వివాహాలకు స్వస్తి పలకండి..

పాచిపెంట మే 18 ప్రభాతవార్త



ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా బాల్యవివాహాల వలన అనర్థాలను ప్రజలకు వివరించి, బాల్య వివాహాలకు దూరం గా ఉండే విధంగా అవగాహన కలిగించాలని పాచిపెంట పోలీస్ స్టేషన్ ఎస్పై, ఎల్.అర్జున్ హితవు పలికారు. అలాగే మండలంలో సోమవారం పి కొనవలస గ్రామంలో వాహనదారులకు, రోడ్డు ప్రమాదాలు మాధక ద్రవ్యాల వినియోగం కలిగే నష్టాలపై అవగాహన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వాహన దారులు ప్రతి ఒక్కరు రోడ్డు బాధ్యత నియమాలు పాటించే సురక్షితంగా గమ్యాన్ని చేరాలని సూచించారు.

## పెట్రోలు డీజిల్ ధరలుతక్షణమే తగ్గించాలి: మాజీ డిప్యూటీ సీఎం పుష్ప శ్రీవాణి

కురుపాం మే18ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వము పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. సోమ వారం రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా కురుపాం నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఓటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కురుపాం మెయిన్ రోడ్డు నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు వినూత్న రీతిలో నాటు బండిపై కార్యకర్తలతో పుష్ప శ్రీవాణి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కు వినతి పత్రం అందించారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రజలను నిలువునా దోచుకుం టున్న కూటమి ప్రభుత్వం, ఇంధన ధరల పెంపుపై నిప్పులు చెలరేగారు. సంపద సృష్టిస్తామని చెప్పి, ప్రజల సంపదను దోచేస్తున్నారని ఆమె మండిపడ్డారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల వల్ల రైతులు, కూలీలు, మధ్యతరగతి కుటుంబాలు బతుకలేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.మోసపూరిత హామీలు ఇచ్చిన లోకేష్ పెట్రోల్ బంక్ దగ్గరికి వెళ్లి సెల్ఫీలు తీసుకుంటూ పెట్రోల్ డీజిల్ ధరలు పెంచమని చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం చెప్తున్నవన్నీ అబద్ధాలేనని, ఇచ్చిన మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు ప్రజలను నట్టేట ముంచారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి మానవత్వం లేదని దుయ్యబట్టారు. ప్రజలెవరూ అమాయకులు కాదని మోసపూరిత రాజకీయాలను, వైఫల్యాలను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని ఈ సందర్భంగా పుస్పశ్రీవాణి గుర్తు చేశారు.

## ప్రజలకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై పాపారావు

పార్వతీపురం, మే17, ప్రభాతవార్త



ప్రజల భద్రత ప్రధాన కర్తవ్యంగా జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు భద్రత నియ మాలపై విస్తృతంగా అవగా హన కార్యక్రమాలు ట్రాఫిక్ ఎస్ఐ పాపా రావు నిర్వహించారు. పట్టణంలో విధులు నిర్వహిస్తున్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మోటార్ వాహనాల చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్ లేకుండా లేదా మద్యం సేవించి వాహనాలు నడపడడం, అతివేగంగా ప్రయాణించడం, ఓవర్ లోడ్, మైనర్ డ్రైవింగ్, వంటి కారణాల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి అని అన్నారు. రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే, ఆ కుటుంబానికి కలిగే నష్టం పూడ్చలేనిదని అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి అని అన్నారు. నియమాలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూనే, ప్రజల్లో బాధ్యతాభావాన్ని పెంపొందించడమే తమ లక్ష్యం అని అన్నారు.

## చాకివలసలో నూతనంగా నిర్మించిన తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం: మే 18,(ప్రభాతవార్త



భోగాపురం మండలంలోని చాకివలస గ్రామంలో డిఎంఎఫ్ నిధులతో నూతనంగా నిర్మిం చిన తాగునీటి సరఫరా ప్రాజెక్టును నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.పైప్లైన్ ద్వారా ఇళ్లకు తాగునీరు సరఫరా అవుతుంది. తాగునీటి ఆమె స్వయంగా పరిశీలించి, గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ, గతంలో చాకివలస గ్రామంలో ఎన్ని చేతి పంపు బోర్లు వేసినప్పటికీ వేసవికాలం వచ్చేసరికి ఎండిపోయేవని, సంవత్సరంలో ఆరు నెలలు మాత్రమే నీళు ఉండేవని, మిగిలిన ఆరు నెలల్లో గ్రామస్తులు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారని అన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా దూరం చేయాలని దృఢ సంకల్పంతో, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ ద్వారా ప్రత్యేకంగా డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయించి నూతన తాగునీరు ప్రాజెక్టును నిర్మించడం జరిగిందని ఎమ్మెల్యే నాగమాధవి తెలిపారు. కూటమి నాయకులు వందనాల రమణ, మట్ట అయ్యప్ప రామకృష్ణారెడ్డి, పల్లంట్ల జగదీష్, బాలయ్య రెడ్డి, సూర్యనారాయణ, జన సైనికులు మరియు గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు ఎగ్ కార్ట్స్ యూనిట్లు పంపిణీ : మంత్రి సంధ్యారాణి

సాలూరు మే18 ప్రభాతవార్త



సాలూరు పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు ఎగ్ కార్ట్స్ యూనిట్లు మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సహకారం అందించాలని 4 సంఘాలకు గాను 2 లక్షల విలువైన నాలుగు ఎగ్ కార్ట్స్ యూనిట్లు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఒక్కో యూనిట్‌కు రూ.50 వేల ఆర్థిక సహాయంతో బండ్లు అందజేయడం జరిగిందని,ప్రతి యూనిట్‌కు ఒక గ్యాస్ స్టవ్, ఒక గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం అందజేసిందని తెలిపారు అలాగే సీఎం చంద్రబాబుకు మంత్రి సంధ్యారాణికి మహిళా సంఘ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. కమిషనర్ టిటి రత్నకుమార్, టౌన్ ప్రెసిడెంట్ చిట్టి,కొనిసి. వరలక్ష్మి,మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



రామభద్రపురం, మే 18 ప్రభాతవార్త

రామభద్రపురం మండలంలో బడి పిలుస్తోంది కార్యక్రమంలో 218 మంది చేరిక ప్రభుత్వ పాఠశాలలోని పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమలప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని బూసాయ వలస గ్రామంలో డోర్టుడోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకే మంచి ర్యాంకులు వచ్చాయని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న వివిధ పథకాలను కూడా వివరించారు. ఎన్రోల్మెంట్ పెంచడానికి స్పెషల్ డ్రైవ్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 218 మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు సిద్ధం చేశామని, ప్రైవేటు పాఠశాలల నుంచి 15 మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ బడిపిలు స్తోంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు, అవగాహనా సదస్సులు నిర్వహించాలని ఆయన సూచిం చారు. బుసాయవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం చెల్లూరి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బూర్జలో సువర్ణముఖి నదిపై వంతెనకు శంకుస్థాపన

పార్వతీపురం, మే17, ప్రభాతవార్త:



నియోజకవర్గం సీతానగరం మండలం బూర్జ గ్రామంలో సువర్ణముఖి నదిపై కొత్త వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ వంతెన కోసం గతంలో చాలా మంది రాజకీయ నాయకులు హామీ ఇచ్చి మర్చిపోయారని అన్నారు. తమ ప్రభుత్వం హయాం లో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడమే కాకుండా సకాలంలో వంతెన పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజల చిరకాల కలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. బూర్జ గ్రామంతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని, తాను వచ్చిన ప్రతిసారీ ఏదో ఒక అభివృద్ధి పనికి శ్రీకారం చుడతానని అన్నారు. గ్రామంలో అవసరమైన చోట సిసి రోడ్లు, పక్కా కాలువలు నిర్మిస్తామన్నారు. గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో పంచాయతీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన స్వచ్ఛరథాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చినఅంకలాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దోకల నరహరితోపాటు 100 కుటుంబాలు వైసిపి పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్. కోటలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోళ్ల



లక్క వరపు కోట మే 18 ప్రభాతవార్త

మండలంలోని ఏల్ కోట మేజర్ పంచా యతీలోని ఎస్‌సి కాలనీలో సోమవారం 30 లక్షల నిధులతో నిర్మించనిన్ను త్రాగునీటి సరఫరాకి ఉపయోగ పడే ఓవర్ హెడ్ ట్యాంక్ పనులకు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా పైలట్ ప్రాజెక్ట్ కింద నియోజకవర్గానికి రూ. 90 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రథమంగా రూ. 30 లక్షల అంచనా వ్యయంతో స్థానిక సంఘం వీధి దగ్గర ఉన్న ఎస్సీ కాలనీలో నూతన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, అలాగే ప్రతి ఇంటికీ కొత్తగా కుళాయిల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి రాం ప్రసాద్ దంపతులకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరామ్ ప్రసాద్, ఏ ఎం సి చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కరెడ్ల ఈశ్వరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామ కృష్ణ, ఏ ఏం సి డైరెక్టర్ పుట్టా శ్రీనివాసరావు, వేపాడ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కోట్యాడ రమణమూర్తి, యూనిట్ ఇంచార్జీ సంఘం సతీష్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్ రాజేష్, మాజీ ఎంపీటీసీ పిన్నింటి రమేష్ నాయుడు, ఎంపీటీసీ రాయవరపు చంద్ర శేఖర్, ప్రాజెక్ట్స్ ఈ ఈ ఎడ్ల గోవిందరావు, డి ఈ ఈ పైడిరాజు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పట్టిపీడిస్తున్న సిబ్బంది కొరత

### పట్టించుకోని జిల్లా అధికారులు

పాచిపెంట మే 18 ప్రభాతవార్త




మండల కేంద్రమైన పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రధానంగా సిబ్బంది కొరత పట్టి పీడించడంతో క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు లేకపోవడం వలన పర్యవేక్షణ అంతంత మాత్రం ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. వేరే జిల్లా నుండి పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి పీ.హెచ్.న్.గా బదిలీపై వచ్చివిధులకు జాయిన్ అయ్యి, తదుపరి నుంచి ఆమె విధులకు రాకపోవడం, అలాగే ఇక్కడ పని చేసిన హెల్త్ విజిటర్ పద్మావతి డిప్యుటేషన్ పై మన్యం జిల్లా పార్వతీపురంకి ఉన్నత అధికారులు పంపించడం వలన వైద్య సేవలకు అంతరాయం కలుగుతుంది అన్న విమర్శ లు విరువగా వినిపిస్తున్నాయి. రెండు విషయాలును ప్రభాతవార్త సోమవారం శరవాణిలో పాచిపెంట పిహెచ్సి ఇన్చార్జి వైద్యాధికారి శివకుమార్ను వివరణ కోరగా, పి హెచ్ ఎన్ విధుల్లో జాయిన్ అయిన తర్వాత, తదుపరి నుండి పిహెచ్సికి పీ.హెచ్.ఎన్. విధులకు రావడంలేదని ఉన్నతాధికారులకు సమాచారమిచ్చినట్లు , అదేవిధంగా హెచ్ వి .పద్మావతి డిప్యుటేషన్ నేను ఇన్చార్జి వైద్యాధికారి గాఉన్న టైంలో ఆమె వెళ్లలేదని గతంలో వెళ్లారనీ, ఇన్చార్జి వైద్యాధికారి శివకుమార్ శరవాణిలో ప్రభాతవార్తకు తెలిపారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 9 సబ్ సెంటర్లు కలవు .1 పనస పెద్ది కోన వలస, 2 ,పనుకువలస 3 విశ్వనాథపురం, 4,కర్రివలస 5పద్మాపురం, 6 కోటికి పెంట7 కేసలి, 8 పాచిపెంట 1, 9,పాచిపెంట2 , పై సబ్ సెంటర్ పరిధిలో జనాభా 26, వేల177 జనాభా కలిగి ఉన్నారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం రౌండ్ క్లాక్ ఆరోగ్య కేంద్రం అయినప్పటికీ ఒకే వైద్యాధికారి విధులు నిర్వహించడం అదేవిధంగా పర్యవేక్షించవలసిన అధికారులు ఒకరు డిప్యుటేషన్ పై ఒకరు, మరి ఒకరు సెలవు పై వెళ్లడం వలన ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సేవలు అంతంత మాత్రమే ఉండడంవల్ల రోగులు ఇబ్బందులు గురవుతున్నారు. ఈ విషయమై ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే పూర్తి స్థాయిలో సిబ్బంది ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అలాగే ప్రజా ప్రతినిధులు కూడా కలుగజేసుకొని పాచి పెంట పిహెచ్సికి పూర్తిస్థాయిలో పర్మినెంట్ వైద్యాధికారిని సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రత అవసరం డాక్టర్ రిషి కుమార్

బలిజిపేట మే 18 ప్రభాతవార్త



బలిజిపేట మండలం గలవల్లి ప్రాథమిక ఆరోగ్య పరిధిలోగల బోధవ్యాధితో బాధపడుతున్న రోగులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గళావిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి. రిషి కుమార్ తెలియజేశారు. సోమవారం గంగాడ గ్రామంలో గళావిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు బి. రేవతి, జి. రిషి కుమార్ ఆధ్వర్యంలో గంగాడ గ్రామంలో బోధ వ్యాధిగ్రస్తుల వ్యక్తిగత పరిశుభ్రతకు అవసరమైన టబ్ లు, తువ్వాలు, సబ్బులు, జగ్గులు, ఆయింట్మెంట్, మొదలగు సామాగ్రి అందజేశారు. చిలకలపల్లి స్కోప్ సభ్యులు శివరామకృష్ణ, మూర్తి బోధవ్యాధిగ్రస్తులు ఈ కిట్లను ఎలా ఉపయోగించుకోవాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.ఈవో నరసింహులు, హెచ్ ఎస్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు శంకర్రావు, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

## కొత్త పింఛన్లు మంజూరు ప్రకటన పై వితంతువుల్లో చిగురిస్తున్న ఆశలు

గరివిడి మే,18 ప్రభాత వార్త

వితంతువులు కి కొత్త పింఛన్లు మంజూరుకి సంబంధించి ప్రభుత్వ ప్రకటన పై వితంతువుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత రెండేళ్లుగా వితంతువులు కి కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. భర్తను కోల్పోయి సమాజంలో చిన్నచూపుకి గురై, చేతిలో చిల్లి గవ్వలేక పట్టెడు మెతుకులు కి నోచుకోని స్థితిలో ప్రభుత్వ పింఛను కోసం ఎదురు చూసే అభాగ్య వితంతువులు కి ప్రభుత్వ ప్రకటన వారిలో కోటి ఆశలు నింపింది. ప్రభుత్వ పింఛను తో జీవనాన్ని గడిపేందుకు నిరీక్షించే వారి బతుకుల్లో వెలుగు నింపేందుకు ప్రభుత్వ ప్రకటన తీపి కబురు నింపింది. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి అయిన నేపథ్యంలో జూన్ 12 నుండి వితంతువులు కి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది. అలాగే పింఛన్లు కి ధరఖాస్తులు చేసుకొనే అవకాశం కూడా కల్పించనుంది. రెండేళ్లుగా పింఛను కి నోచుకోని అభాగ్య విడో లు అందరూ ప్రభుత్వ మంజూరు పింఛన్లు పై వారిలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

